www.bharathasakthi.com

# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 16 | హైదరాబాద్ | శనివారం,జూన్ 20 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు అనుమతి మంజూరు

**- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు , భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 19:** మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్ నగరంలోని బాపూ ఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు అనుమతి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు , భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గాంధీ సరోవర్

2లో..

## తెలంగాణలో మూడు రోజులు రిజిస్ట్రేషన్లు బంద్..

- సర్వర్ మెయింటెనెన్స్ కారణంగా జూన్ 26 నుంచి 28 వరకు బంద్
- ప్రజలకు ఇబ్బంది కలగకుండా సెలవు రోజుల్లో నిర్వహణ పనులు
- ఐదేళ్లలో ఇదే మొదటి ప్రధాన అప్‌గ్రేడ్ అని తెలిపిన అధికారులు
- జూన్ 29 నుంచి యథావిధిగా సేవలు పునఃప్రారంభం

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఇతర అనుబంధ ఆన్‌లైన్ సేవలు మూడు రోజుల పాటు నిలిచిపోనున్నాయి. సర్వర్ల నిర్వహణ, అప్‌గ్రేడేషన్ పనుల కారణంగా జూన్ 26 నుంచి 28వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉండవని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పష్టం చేసింది.దాదాపు ఐదేళ్ల తర్వాత చేపడుతున్న


2లో..

## ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు ప్రకటన



**న్యూఢిల్లీ (భారత శక్తి)** దేశంలో పాదచారుల భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక కీలక తీర్పును వెలువరించింది. సక్రమంగా నిర్మించి, నిర్వహించే ఫుట్‌పాత్‌లపై నడవడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మోటారు వాహనాల రాకపోకల కంటే పాదచారుల హక్కులకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ధర్మాసనం

2లో..



## పశ్చిమాసియాలో మళ్లీ బాంబుల మోత

- ట్రంప్‌కు షాక్.. లెబనాన్‌పై మళ్లీ విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో16 మంది మృతి

**ఇజ్రాయెల్ , జూన్ 19:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలను పక్కనబెడుతూ ఇజ్రాయెల్ మరోసారి లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన తాజా శాంతి ఒప్పందంలో లెబనాన్‌ను చేర్చిన విషయం తెలిసిందే. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్లను తక్షణమే ముగించి ఆ ప్రాంతాన్ని వీడాలని ఒప్పందంలో పేర్కొన్నారు. అయితే, దీన్ని ఇజ్రాయెల్ ముందునుంచీ వ్యతిరేకిస్తోంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ట్రంప్ సూచించిన కొన్ని గంటల్లోనే ఒప్పందానికి తూట్లుపొడుస్తూ ఈ దాడులు జరగడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. దక్షిణ లెబనాన్‌లోని నబాటియా, మన్సౌరి, కాఫర్ టెబ్నిట్ వంటి నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, డ్రోన్లు విరుచుకుపడ్డాయి. ఈ తాజా దాడుల్లో కనీసం 16 మందికి పైగా మరణించగా, ముప్పై మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు లెబనాన్ జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది. కాగా, వ్యూహాత్మకమైన అలీ అల్–తాహెర్ కొండ ప్రాంతంలో ముందుకు కదులుతున్న ఇజ్రాయెల్ సైనిక బలగాలపై తాము కూడా ఎదురుదాడి చేసి, మూడు మెర్కావా ట్యాంకులను ధ్వంసం చేసినట్లు ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా ప్రతిఘటన దళం ప్రకటించింది. అమెరికా మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలో ఇజ్రాయెల్ ఈ రకమైన దాడులకు తెగబడటం ట్రంప్ సర్కారుకు పెద్ద షాక్‌గా మారింది. తమ దేశ రక్షణ కోసం లెబనాన్‌లో సైనిక చర్యలు కొనసాగుతాయని ఇజ్రాయెల్ పట్టుబడుతుండటంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. ఈ ఘటన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడి డోనాల్డ్ ట్రాంప్ ఏ విదంగా ముందుకెళ్తాడోనాని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన

**- జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే**



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. సుమారు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) – 2026' కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఁజీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్

2లో..




# తెలంగాణలో క్రీడా విప్లవం

## రూ.50.73 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధికి శ్రీకారం

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు..
- జిల్లాల్లో మినీ స్టేడియాలు, గచ్చిబౌలిలో అంతర్జాతీయ స్థాయి అకాడమీలు సిద్ధం!

**భారత శక్తి -- హైదరాబాద్:** తెలంగాణను క్రీడల హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం భారీ ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా రూ.50.73 కోట్ల అంచనా వ్యయంతో పలు క్రీడా ప్రాజెక్టులకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు జిల్లాల్లో క్రీడా మైదానాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడంతో పాటు, హైదరాబాద్ నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ అకాడమీలను వారు ప్రారంభించారు.

2లో..

[redacted]

## బడి సమాచారం ఇక 'వాట్సాప్'లోనే!



- విద్యాశాఖ, మీసేవ ఆధ్వర్యంలో డిజిటల్ విప్లవం
- 18లక్షల మంది విద్యార్థులు, తల్లిదండ్రులకు నేరుగా ఫోన్లకే అప్‌డేట్స్
- రాష్ట్ర పక్షి 'పాలపిట్ట' డిజిటల్ మస్కట్‌గా వినూత్న ప్రయోగం

**హైదరాబాద్, జూన్ 19: భారత శక్తి** డిజిటల్ పరిపాలనలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రభుత్వ పాఠశాలల సమాచారాన్ని ఎప్పటికప్పుడు విద్యార్థులు, తల్లిదండ్రులకు చేరవేసేందుకు విద్యాశాఖ, మీసేవ (ఎలక్ట్రానిక్ సేవల విభాగం) సంయుక్తంగా వాట్సాప్ ఆధారిత సేవలను అందుబాటులోకి తెచ్చాయి. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ఒక అధికారిక కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నూతన విధానాన్ని ప్రారంభించారు. ఈ వినూత్న డిజిటల్ వేదిక ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విద్యా పురోగతి, పరీక్షలు, ప్రభుత్వ పథకాల వివరాలను నేరుగా మొబైల్ ఫోన్లలోనే పొందే అవకాశం లభించింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలోని సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ ఁ కమ్యూనికేషన్స్ శాఖకు చెందిన మీసేవ విభాగం, విద్యాశాఖతో కలిసి ఈ సరికొత్త ప్లాట్‌ఫారమ్‌ను రూపొందించింది.

2లో..

## రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా నవ భారత నిర్మాణం జరగాల్సి ఉంది: మహేశ్ గౌడ్



**హైదరాబాద్ (భారత శక్తి)** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లిలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం 'గాంధీ భవన్'లో వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భారీ కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాంధీ భవన్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ... దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, సమాన అవకాశాలు కల్పించడమే రాహుల్ గాంధీ ప్రధాన రాజకీయ లక్ష్యమని అన్నారు. "దేశంలో నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల వంటి కీలక సమస్యలపై రాజీలేని

2లో..

## రాహుల్ పుట్టిన రోజున రైతు డిక్లరేషన్ బొందపెట్టిన రేవంత్ సర్కార్

**-హరీశ్ రావు**



**సిద్దిపేట, (భారత శక్తి):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు.కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకు? అని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని రేవంత్ రెడ్డి మంత్రి వర్గాన్ని ఆయన అభివర్ణించారు. మీది విశ్వాసఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు.పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తే సిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటోందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది

2లో..

## రాష్ట్రంలో ప్రభుత్వం కాదు.. మాఫియా నడుస్తోంది

- కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు పూర్తిగా విసిగిపోయారు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణలో ఎగిరేది గులాబీ జెండానే
- ఇప్పటినుంచే కార్యకర్తలే కథానాయకులై కదంతొక్కాలి ఎస్.ఐ.ఆర్ లో అర్హులైన ఓట్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోండి
- పార్టీ సభ్యత్వ నమోదును యాప్ ద్వారా ఇంటింటికి వెళ్లి విజయవంతం చేయండి
- మల్కాజ్ గిరి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**మల్కాజ్ గిరి(భారత శక్తి)** రాష్ట్రంలో గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం నడవడం లేదని, కేవలం మాఫియా మాత్రమే రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ర నలుమూలలా ఎవరిని కదిలించినా కాంగ్రెస్ అరాచక పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణలో ఎగిరేది ముమ్మాటికీ గులాబీ జెండా మాత్రమేనని స్పష్టంచేశారు. ఏ ఎన్నికలొచ్చినా పార్టీ గెలుపు కోసం కార్యకర్తలే కథానాయకులై కదంతొక్కాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇవాళ మల్కాజిగిరిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. జిల్లాలతో పాటు హైదరాబాద్ లోని మల్కాజిగిరిలోనూ ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే ఇక్కడి సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపాలిటీలపై కూడా బీఆర్ఎస్ జెండా రెపరెపలాడటం ఖాయమని కేటీఆర్ వెల్లడించారు . తెలంగాణకు మళ్లీ మంచిరోజులు రావాలన్నా, హైదరాబాద్ అభివృద్ధి పట్టాలపై పరుగులు పెట్టాలన్న అది బీఆర్ఎస్ తోనే సాధ్యమని ప్రజలు గుండెలనిండా ఆశీర్వదిస్తున్నారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి సారథ్యంలో రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లపాటు అభివృద్ధి, సంక్షేమం జోడెద్ల మాదిరిగా ముందుకు సాగాయని కేటీఆర్ తెలిపారు. 2014 కు ముందు ఎండాకాలం

2లో..

# తెలంగాణలో క్రీడా విప్లవం





### రూ.36.65 కోట్లతో జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతకు క్రీడా వసతులను అందుబాటులోకి తెచ్చేందుకు రూ.36.65 కోట్ల వ్యయంతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం, ఆధునీకరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

### శంకుస్థాపనల పూర్తి వివరాలు:

- షాద్ నగర్ (రంగారెడ్డి జిల్లా): కొందుర్గ్ మండల కేంద్రంలో రూ.10 కోట్ల వ్యయంతో మినీ స్టేడియం నిర్మాణం.
- **సంగారెడ్డి:** రూ.10 కోట్లతో జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం ఆధునీకరణ పనులు.
- **నారాయణపేట:** నర్వ మండల కేంద్రంలో రూ.4 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం.
- **వనపర్తి (ఆత్మకూర్):** రూ.4 కోట్లతో బహుళ ప్రయోజన (మల్టీ పర్పస్) స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి.

**కామారెడ్డి:** గాంధారి మండల కేంద్రంలో రూ.3.50 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం.
**మెదక్:** నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో రూ.2.65 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం.
**నారాయణపేట (మక్తల్):** ఉట్కూరులో రూ.2.50 కోట్లతో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణం.

### రూ.14.08 కోట్లతో అంతర్జాతీయ స్థాయి అకాడమీల ప్రారంభం

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలలో బాలబాలికలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు రూ.14.08 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పలు అకాడమీలను ముఖ్యమంత్రి, గవర్నర్ ప్రారంభించారు. ముఖ్యంగా ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (FIFA), అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (AIFF) సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన టాలెంట్ అకాడమీలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### ప్రారంభమైన అకాడమీల వివరాలు:

ఫిఫా - ఏఐఎఫ్ఎఫ్ తెలంగాణ టాలెంట్ అకాడమీ (గచ్చిబౌలి): బాలికల అకాడమీకి రూ.5.70 కోట్లు, బాలుర అకాడమీకి రూ.5.70 కోట్లు.
**హాకీ అకాడమీ (గచ్చిబౌలి):** బాలికల విభాగానికి రూ.44.50 లక్షలు, బాలుర విభాగానికి రూ.44.50 లక్షలు.?

**అథ్లెటిక్స్ అకాడమీ (గచ్చిబౌలి):** బాలికల విభాగానికి రూ.35.95 లక్షలు, బాలుర విభాగానికి రూ.35.94 లక్షలు.
**ఫుట్‌బాల్ అకాడమీ (ఎల్బీ స్టేడియం):** బాలుర శిక్షణ కోసం రూ.58.50 లక్షలు.హ్యాండ్‌బాల్ అకాడమీ (ఎల్బీ స్టేడియం): బాలుర శిక్షణ కోసం రూ.49 లక్షలు.

### భారత శక్తి విశ్లేషణ:

ఈ సరికొత్త మౌలిక సదుపాయాలు మరియు శిక్షణా కేంద్రాల ఏర్పాటు ద్వారా తెలంగాణ నుండి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారయ్యేందుకు బలమైన పునాది పడింది.
ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కోర్టులు, స్టేడియాలు అందుబాటులోకి రావడం క్రీడాకారుల ప్రతిభకు మరింత పదును పెట్టనుంది.

## గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు అనుమతి మంజూరు

ప్రాజెక్టుకు అనుమతి లభించడం, తెలంగాణ ప్రభుత్వ విజన్ లక్ష్యాలను సాధించడంలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మూసీ నది సమగ్ర పునరుజ్జీవనం, నదీ తీర ప్రాంతాల అభివృద్ధి, అలాగే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పర్యావరణ, సాంస్కృతిక, సామాజిక వనరుల సృష్టి దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ నిర్ణయం మరింత బలాన్ని చేకూరుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మూసీ నది పరివాహక ప్రాంతం పర్యావరణపరంగా పునరుజ్జీవం పొందడమే కాకుండా ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రజా స్థలాలు, సాంస్కృతిక కేంద్రాలు, పర్యాటక ఆకర్షణలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, భారత సైన్యం అందిస్తున్న సహకారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలంగాణలో మూడు రోజులు రిజిస్ట్రేషన్లు బంద్..

ఈ కీలకమైన నిర్వహణ పనుల ద్వారా సర్వర్ల పనితీరును, భద్రతను మరింత మెరుగుపరచనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత వేగవంతమైన, సులభతరమైన సేవలు అందించడమే ఈ అప్‌గ్రేడేషన్ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ షట్‌డౌన్‌ను సెలవు దినాల్లో నిర్ణయించారు. జూన్ 26న మొహర్రం పబ్లిక్ హాలిడే, జూన్ 28 ఆదివారం కావడంతో కేవలం ఒకే ఒక పనిదినమైన జూన్ 27 (శనివారం) మాత్రమే సేవలపై ప్రభావం పడనుంది. ఇప్పటికే జూన్ 27వ తేదీ కోసం స్లాట్లు బుక్ చేసుకున్న వారికి, వాటిని జూన్ 25వ తేదీకి మార్చినట్లు అధికారులు వెల్లడించారు.ఈ మూడు రోజుల పాటు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్, ఆన్‌లైన్ పోర్టల్స్‌లు పనిచేయవు. జూన్ 29వ తేదీ నుంచి సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని, పౌరులు దీనికి అనుగుణంగా తమ పనులను ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు ప్రకటన

తేల్చి చెప్పింది.జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఏ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి) (దేశవ్యాప్తంగా స్వేచ్ఛగా సంచరించే హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కు)లలో భాగంగానే ఫుట్‌పాత్‌పై నడిచే హక్కు కూడా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. గౌరవప్రదమైన జీవనానికి సురక్షితమైన ఫుట్‌పాత్‌లు అత్యవసరమని, వాటిని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జస్టిస్ నరసింహ తన తీర్పులో వివరించారు.కర్ణాటకలో చోటుచేసుకున్న ఒక విషాద ఘటన ఈ తీర్పునకు నేపథ్యంగా నిలిచింది. పాఠశాలకు వెళుతున్న ఒక బాలుడిని లారీ ఢీకొట్టడంతో అతడు మరణించాడు. ఆ ప్రాంతంలో సరైన ఫుట్‌పాత్ లేకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తేలింది. ఈ కేసులో బాధితుడి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని సుప్రీంకోర్టు రూ.11.44 లక్షలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది.దేశంలోని నగరాల్లో ఫుట్‌పాత్‌లు సక్రమంగా లేకపోవడం, ఆక్రమణలకు గురికావడం లేదా పూర్తిగా అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను కోర్టు ప్రస్తావించింది. దీనిని ఒక నాగరికతా సమస్యగా న్యాయస్థానం అభివర్ణించింది. రహదారులు ఉన్న ప్రతిచోటా ఫుట్‌పాత్‌లను నిర్మించి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, పంచాయతీలదేనని గుర్తు చేసింది. పాదచారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సూచించింది. ఈ చారిత్రాత్మక తీర్పు భవిష్యత్తులో పట్టణ ప్రణాళిక విధానాలపై గణనీయమైన ప్రభావం చూపుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన

25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ధృవీకరిస్తారు. నకిలీ, మరణించిన మరియు చిరునామా మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 35,000 మందికి పైగా బీఎల్‌ఓలు, దాదాపు 26,000 మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## బడి సమాచారం ఇక 'వాట్సాప్'లోనే!

### ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా..

విద్యార్థులు, తల్లిదండ్రులకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే లక్షలాది మంది ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. దీనివల్ల కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గి సమయం, డబ్బు ఆదా అవుతోంది.

### ప్రస్తుతం వాట్సాప్‌లో లభిస్తున్న ప్రధాన సేవలు:

- విద్యార్థుల ప్రగతి పత్రాలు (ప్రోగ్రెస్ రిపోర్టులు)
- ప్రవేశ పత్రాల (హాల్ టికెట్ల) డౌన్‌లోడ్
- మార్కుల పట్టికలు (మెమోలు), పరీక్షా ఫలితాలు
- పదో తరగతి సర్టిఫికెట్లు, వాటి సవరణల దరఖాస్తులు
- విద్యార్థి గుర్తింపు (బోనఫైడ్), బదిలీ ధృవీకరణ పత్రాలు (టీసీ)

### త్వరలోనే మరిన్ని సేవలు..

రాబోయే రోజుల్లో ఈ వాట్సాప్ వేదికను మరింత విస్తరించనున్నారు. రెండో దశలో క్రింది సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు:
- పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, నోట్‌బుక్స్ పంపిణీ వివరాలు
- విద్యార్థుల దైనందిన హాజరు సమాచారం
- మెట్రిక్ పూర్వ విద్యార్థి వేతనాల (ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్) దరఖాస్తులు
- మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల ఆరోగ్య వివరాలు
- వసతి గృహ (రెసిడెన్షియల్) పాఠశాలల సంక్షేమ కార్యక్రమాలు
- క్రీడలు, పాఠ్యేతర అంశాల సమాచారంతో పాటు ఫీడ్‌బ్యాక్ (అభిప్రాయ సేకరణ)

### ఆకట్టుకుంటున్న 'పాలపిట్ట' మస్కట్.

ఈ డిజిటల్ సేవల ప్రచారంలో భాగంగా రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'ను డిజిటల్ మస్కట్‌గా పరిచయం చేశారు. పాలపిట్ట యానిమేషన్ వీడియోల ద్వారా విద్యా సమాచారం, అవగాహన సందేశాలను వాట్సాప్‌లో పంపనున్నారు. ఈ సృజనాత్మక ఆలోచన విద్యార్థులను, ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

### దేశానికే ఆదర్శం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

విద్యా రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంచవచ్చని, తల్లిదండ్రులతో ప్రభుత్వ అనుసంధానం బలపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమర్థవంతమైన డిజిటల్ సేవలను ప్రజల చెంతకు చేర్చడంలో తెలంగాణ మరోసారి దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో ఈ వాట్సాప్ విద్యా సేవలు ఒక మైలురాయిగా నిలుస్తాయని ఐటీ, విద్యాశాఖల అధికారులు వెల్లడించారు.

## గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి

**కరీంనగర్(భారత శక్తి)**గ్రామాల్లో విరివిగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పశు వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న జిల్లా ప్రధాన పశువుల ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు.రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి ద్వారా పశువులకు అందిస్తున్న సేవలు, వాక్సినేషన్, మందుల వివరాలు తెలుసుకున్నారు. గదులు కలియ తిరుగుతూ ల్యాబరేటరీ, శస్త్ర చికిత్స గదులు,ఎక్స్ రే గది, మందుల గది పరిశీలించారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. శిథిల భవనం తొలగించండి:ఆస్పత్రి ముందు శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని పరిశీలించి..తొలగించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పాత భవనం స్థానంలో ఫౌంటెయిన్, పార్కింగ్ ప్లేస్, జంతువుల శవపరీక్ష ఏర్పాటు చేయాలన్నారు.పక్కనున్న మరో భవనాన్ని జంతువుల ఆపరేషన్ కోసం వినియోగించాలని సూచించారు.ఇక్కడున్న అన్ని పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

### ఆర్.ఓ.ఆర్ కేసు పెండింగ్‌లో ఉండగా

## భూమికు హద్దులు ఏర్పాటు

### - పిజిఆర్ఎస్ నందు కలెక్టర్‌కు ఫిర్యాదు.

**తుగ్గలి:(భారత శక్తి)** తుగ్గలి గ్రామ పరిధిలోని సర్వే నెం.758కు సంబంధించి దాదాపు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్.ఓ.ఆర్. (రికార్డు ఆఫ్ రైట్స్) కేసును పరిష్కరించకుండా,అదే భూమిలో సర్వే,హద్దుల నిర్ణయం,భూమి స్వరూప మార్పులు చేపట్టారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ఎం.రవీంద్రనాథ్ శర్మ శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం సర్వే నెం.758కు సంబంధించి 2023 ఆగస్టు 22న దరఖాస్తు సమర్పించగా,అనంతరం అక్టోబర్ 16న మరో దరఖాస్తు ఇవ్వడంతో ఆర్.ఓ.ఆర్ కేసు నమోదు అయింది.అయితే ఆ కేసు ఇప్పటి వరకు తుది నిర్ణయానికి రాలేదని పేర్కొన్నారు.కేసు పెండింగ్‌లో ఉన్న సమయంలో ఎటువంటి సర్వే లేదా రీ-సర్వే చేపట్టరాదని 2024 సెప్టెంబర్ 20న అధికారులకు ప్రత్యేక వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇటీవల సంబంధిత సర్వేయర్,గ్రామ సిబ్బంది కలిసి ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా భూమిలో హద్దులు నిర్ణయించినట్లు తనకు సమాచారం అందిందని పేర్కొన్నారు.ఆర్.ఓ.ఆర్ కేసులో పిటిషనర్ అయిన తనకు గానీ, పొరుగు భూముల యజమానులకు గానీ నోటీసులు జారీ చేయలేదని ఆరోపించారు.అలాగే సంబంధిత భూమిలో ఒక వ్యక్తికి మౌఖిక అనుమతి ఇచ్చి జేసీబీ సహాయంతో భూమిని చదును చేయించడం,హద్దులు ఏర్పాటు చేయించడం వంటి చర్యలు చేపట్టారని ఆరోపించారు.ఒకవైపు ఆర్.ఓ.ఆర్ కేసు పెండింగ్‌లో ఉండగా,మరోవైపు పి.జి.ఆర్.ఎస్ దరఖాస్తు ఆధారంగా భూమికి సంబంధించిన చర్యలు చేపట్టడం చట్టబద్ధతపై అనుమానాలు వ్యక్తం చేశారు.దాదాపు మూడు సంవత్సరాలుగా కేసు పెండింగ్‌లో ఉండటంతో పాటు, సంబంధిత రెవెన్యూ కార్యాలయాలను అనేకసార్లు సంప్రదించినప్పటికీ ఎటువంటి పురోగతి కనిపించలేదని వాపోయారు.కేసు పరిష్కారం కాకముందే ఒక పక్షానికి అనుకూలంగా చర్యలు చేపట్టడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో సంబంధిత సర్వేయర్,వీఆర్ఓ, తలారీలు మరియు ఇతర అధికారుల చర్యలపై సమగ్ర విచారణ నిర్వహించాలని పి.జి.ఆర్.ఎస్ ఆధారంగా చేపట్టిన చర్యలకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలని కలెక్టర్‌ను కోరారు.అలాగే కేసు తుది పరిష్కారం అయ్యే వరకు సర్వే నెం.758లో అన్ని చర్యలను నిలిపివేయాలని,మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్.ఓ.ఆర్ కేసును తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు."చట్టబద్ధమైన విచారణ జరిపించి, సంబంధిత పక్షాల హక్కులను పరిరక్షిస్తూ న్యాయసమ్మతమైన నిర్ణయం తీసుకోవాలి" అని రవీంద్రనాథ్ శర్మ తన వినతిపత్రంలో కోరారు.

## మా అత్తను తొందరగా చంపించు స్వామి

**అనంతపురం,(భారత శక్తి)** సాధారణంగా గుడికి వెళ్లిన భక్తులు తమకు మంచి జరగాలని, ఉద్యోగం రావాలని, ఆరోగ్యం కుదుటపడాలని దేవుడిని కోరుకుంటారు. కానీ, ఓ మహిళ మాత్రం తన అత్త చనిపోవాలని దేవుడికి మొరపెట్టుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. తన కోరికను కరెన్సీ నోటుపై రాసి హుండీలో వేసిన ఈ ఘటన అనంతపురం జిల్లాలో వెలుగుచూసింది. హుండీ లెక్కింపు సందర్భంగా ఈ వింత కోరికను చూసి అధికారులు, భక్తులు నిర్ఘాంతపోయారు.వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం పంపనూరులో ప్రసిద్ధి చెందిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఉంది. తాజాగా ఆలయ అధికారులు హుండీ కానుకలను లెక్కించడం ప్రారంభించారు. ఈ క్రమంలో వారికి కొన్ని 20 రూపాయల నోట్లు కనిపించాయి. వాటిపై రాసి ఉన్న రాతలు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఓ నోటుపై "స్వామీ.. మా అత్త వేధింపులు తట్టుకోలేకపోతున్నాను.. తొందరగా మా అత్త చనిపోయేలా చూడు" అని రాసి ఉండగా, మరో నోటుపై "స్వామీ.. మా అత్త త్వరగా చనిపోవాలి" అని రాసి ఉంది.ఈ విషయం బయటకు తెలియడంతో స్థానికంగా కలకలం రేగింది. అత్తగారి మరణాన్ని కోరుతూ ఓ కోడలు ఏకంగా దేవుడికే మొక్కుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కుటుంబంలో అత్త పెట్టే హింసలు, వేధింపులు ఏ స్థాయికి చేరితే ఓ కోడలు ఇంతటి తీవ్రమైన నిర్ణయం తీసుకుంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. తన బాధను ఎవరికీ చెప్పుకోలేక, మానసిక ఒత్తిడితో ఆ మహిళ ఈ విధంగా దేవుడికి తన ఆవేదనను తెలియజేసి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఆలయాల హుండీలను ప్రజలు కేవలం కానుకలు సమర్పించడానికే కాకుండా తమ ఆవేదనలు, ఫిర్యాదులు, అభిప్రాయాలు తెలిపే వేదికగా కూడా వాడుకుంటున్న ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి. రెండు నెలల క్రితం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో సౌకర్యాలు సరిగా లేవంటూ ఓ భక్తుడు రాసిన లేఖ హుండీలో లభించడం సంచలనం సృష్టించింది. అలాగే, గతేడాది అనంతపురం జిల్లాలోనే ఓ ఆలయంలో దొంగతనం చేసిన వ్యక్తులు, నెల రోజుల తర్వాత ఆ డబ్బును తిరిగి హుండీలో వేసి, క్షమించమంటూ ఓ లేఖను కూడా వదిలి వెళ్లారు.

# సాయికృష్ణ కేసులో కీలక మలుపు

**విజయవాడ(భారత శక్తి)** కృష్ణలంక పోలీసుల కస్టడిలో అనుమానస్పద మృతి చెందిన సాయి కృష్ణ కేసులో కృష్ణలంక పోలీస్టేషన్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ లతా కుమారీని విచారించారు. సాయికృష్ణ కేసు వ్యవహారంలో విచారణకు రావాలని లతా కుమారికి పిలుపు మేరకు ఆమె అక్కడికి వచ్చారు. మార్కాపురం నుంచి సాయికృష్ణ ను తీసుకొచ్చిన తరువాత టాస్కోఫర్స్ పోలీసులు విచారించారన్న సమాచారంతో లతా కుమారిని ఏసీపీ దైవ ప్రసాద్ పిలిపించారు.

## రాహుల్ పుట్టిన రోజున రైతు డిక్లరేషన్ బొందపెట్టిన రేవంత్ సర్కార్

కేసీఆర్ ప్రభుత్వమని ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని రేవంత్ ప్రభుత్వానికి ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.దళారుల దయా దాక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మరి మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా? అని నిలదీశారు. తడి గుడ్డతో రైతుల గొంతును ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు.ఎకరాకు రెండు బస్తాలు మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని ప్రభుత్వంలోని మంత్రులను ఆయన సూటిగా ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా? అని ప్రభుత్వ వైఖరిని ఆయన ఎండగట్టారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతావి ఎట్లా అని ప్రభుత్వాన్ని నిలదీశారు.కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయిందని ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదన్నారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 2024-25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని ఆయన పేర్కొన్నారు.రైతుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడిందని ఆరోపించారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఈ సందర్భంగా ఆయన బల్ల గుద్ది మరీ ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా? అని మంత్రులకు హరీశ్ రావు సవాల్ విసిరారు.మొత్తం రాష్ట్రంలో 7,600 మంది రైతులకు బీమా రాలేదని గణాంకాలతో సహా హరీశ్‌రావు వివరించారు. ఎందుకు బీమా రావడం లేదంటే.. ప్రభుత్వం ప్రీమియం కట్టలేదని రైతులు చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా నవ భారత నిర్మాణం జరగాల్సి ఉంది: మహేశ్ గౌడ్

పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ. దేశవ్యాప్తంగా వివిధ ఉద్యోగ నియామక పరీక్షల్లో తరచూ జరుగుతున్న పేపర్ లీకేజీల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. యువతకు సరైన ఉపాధి అవకాశాలు దక్కాలంటే కేంద్ర ప్రభుత్వ విధానాల్లో స్పష్టమైన మార్పు రావాలి" అని చెప్పారు.రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, యువత సాధికారతతో కూడిన నవ భారత నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కేవలం కొద్దిమంది కార్పొరేట్ పెత్తందారుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగుల హక్కుల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడుతుందని స్పష్టం చేశారు. దేశ ప్రజలకు మరింత సేవలందించేందుకు రాహుల్ గాంధీకి భగవంతుడు దీర్ఘాయుష్షును, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## రాష్ట్రంలో ప్రభుత్వం కాదు.. మాఫియా నడుస్తోంది

వచ్చిందంటే చాలు కరెంట్ కష్టాలతో ప్రజలు అల్లాడిపోయే వారని గుర్తుచేశారు. అపార్ట్మెంట్లు, దుకాణాల వద్ద జనరేటర్ల మోత మోగేదని, ప్రజల జేబులు ఖాళీ అయ్యేవని తెలిపారు. పరిశ్రమలకు మూడురోజుల పాటు పవర్ హాలిడేలు ప్రకటిస్తే, ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు చేసే దుస్థితి ఉండేదని కేటీఆర్ స్పష్టంచేశారు. కరెంట్ తోపాటు తాగునీటి కూడా తండ్లాట ఉండేదని, ఖైరతాబాద్ లోని జలమండలి ముందు ఖాళీ బిందెలతో ప్రతినిత్యం ధర్నాలు, నిరసనలు హోరెత్తిపోయేవని అన్నారు. కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేప్టటిన ఆరు నెలల్లోనే ఆరు దశాబ్దాల కరెంట్ సమస్యను శాశ్వతంగా తీర్చారని, లక్ష కోట్లు ఖర్చుపెట్టి అటు వ్యవసాయానికి, ఇటు గృహ అవసరాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు.

హైదరాబాద్ వాసుల తాగునీటి కష్టాలను తీర్చి, ఏకంగా 25 వేల లీటర్ల వరకు ప్రతి ఇంటికి ఉచితంగా ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ గారు అనే విషయాన్ని గుర్తుచేశారు. సంక్షేమ రంగంలో స్వర్ణయుగాన్ని ఆవిష్కరించామని, 200 ఉన్న పెన్షన్ ను 2000 కు పెంచుకున్నామని, ఒక్క హైదరాబాద్ లోనే లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని తెలిపారు. మల్కాజిగిరిలోనే 3500 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చుకున్నామని తెలిపారు.

15 లక్షల మంది ఆడబిడ్డల పెండ్లిళ్లకు కల్యాణలక్ష్మి కింద లక్ష రూపాయలు అందించి ఆదుకున్న మేనమామ కేసీఆర్ గారు అని వెల్లడించారు. ట్రెయిలర్ చూస్తేనే సినిమా హిట్టో, ఫట్టో చెప్పే రోజులివని, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సగం సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ అసమర్థ పాలనను చూసి తిట్టుకోని రోజు లేదని స్పష్టంచేశారు. అన్నం ఉడికిందా లేదా అని చెప్పడానికి మెతుకు చాలని, 30 నెలల్లో తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందని మండిపడ్డారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## డేంజర్‌లో 200 జిల్లాలు

12 రాష్ట్రాలపై ఎల్‌నినో పంజా.. ఇదైతే పక్కా, దాదాపు 60 శాతం దేశాన్ని కబళించబోతోంది ఎల్‌నినో రక్కసి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన హైఅలర్ట్ ఇది. ఖరీఫ్ సీజన్‌ను మొదట్లోనే తుంచి పడేసేలా, వీలైతే రబీని కూడా డ్యామేజ్ చేసేలా, ఇప్పటికే కరవు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విషాదం ఏంటంటే, ఎల్‌నినో పీడిత 12 రాష్ట్రాల్లో మన తెలుగు రాష్ట్రాలు కూడా ఉన్నాయి. సాగునీటి కోసం రైతాంగం, తాగునీటి కోసం సామాన్య జనాభా అలమటిస్తోంది. ఎల్‌నినో ఎఫెక్ట్ దేశాన్ని ఎటు తీసుకెళ్తుందిఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం దెబ్బతింటుందన్న భయాందోళనలు నెలకొన్నా మరోవైపు కేంద్రం వద్ద ప్రస్తుతం భారీగా ఆహారధాన్యాల నిల్వలు ఉండడంతో ఆహారభద్రతపై ఎలాంటి ఎల్‌నినో ప్రభావం ఉండబోదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. అయితే ఈ నిల్వలను వృథా కాకుండా సరిగ్గా పంపిణీ, విక్రయాలు సాగించగలిగితేనే ధరలు అదుపులో ఉంటాయి. దీనికి ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ అనే పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే వర్షాభావంతో దేశంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 200కు పైగా జిల్లాల్లో వ్యవసాయానికి ముప్పు వచ్చే పరిస్థితులు కమ్ముకొస్తున్నాయి. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉన్న 12 రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి. వర్షాలు సకాలంలో పడకపోవడంతో వరి వంటి నీటి అవసరాలపై ఎక్కువగా ఆధారపడే పంటల ఉత్పత్తికి ముప్పు ఏర్పడుతుంది. అయితే ప్రస్తుతం కేంద్రం వద్ద జూన్ 1 నాటికి రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల నిల్వలు 122 మిలియన్ టన్నుల వరకు ఉండడం విశేషం. ఏడాది పొడుగునా వరి వినియోగానికి ఇవి సరిపోతాయి. మొత్తం నిల్వల్లో 68.43 మిలియన్ టన్నుల వరి, 53.41 మిలియన్ టన్నుల వరకు గోధుమలు ఉన్నాయి. ఈ భారీ నిల్వల్లో సుమారు 80 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించాలంటే ఏటా 56 మిలియన్ టన్నులు అవసరం కాగా, ప్రస్తుత నిల్వలు దాదాపు రెండేళ్లపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఉచితంగా సరఫరా చేయడానికి సరిపోతాయి. అందువల్ల దేశానికి ఆహార భద్రతపై భరోసా లభిస్తోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణ వర్షపాతం నమోదు కాకపోయినా ప్రాథమిక ఆహార లభ్యతకు ఎలాంటి ఢోకా లేదు. ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ (ఒఎంఎస్ఎస్) ద్వారా గోధుమ, బియ్యం వంటి ఆహార ధాన్యాలను రాష్ట్ర ప్రభుత్వాలతోసహా భారీ సంఖ్యలో వినియోగదారులకు విక్రయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాల కోసం ఎఫ్‌సిఐ నుండి నేరుగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేయవచ్చు. ఆహార భద్రతను నిర్వహించడం, నిల్వలు వృథా కాకుండా చూడడం, మార్కెట్లో ధరలను అదుపులో ఉంచడం ఈ ఒఎంఎస్ఎస్ పథకం ఉద్దేశం. 2025 26లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.04 మిలియన్ టన్నులు కాగా, అంతకన్నా ఎక్కువగా 176.16 మిలియన్ టన్నుల ఉత్పత్తిని 2026 27లో సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో 123.15 మిలియన్ టన్నుల వరి, 8.4 మిలియన్ టన్నుల కాయధాన్యాలు, 28.92 మిలియన్ టన్నుల చమురు గింజలు, 13.56 మిలియన్ టన్నుల చిరుధాన్యాలు. 31.04 మిలియన్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి చేయాలని చూస్తున్నారు. అయితే ఆహార ధాన్యల సద్వినియోగానికి ఒఎంఎస్ఎస్ పథకానికి భారీ కేటాయింపులు అవసరమని, ఇథనాల్ (ఇంధనం) ఉత్పత్తి కోసం సబ్సిడీ ధరలో బియ్యం కోటా కేటాయింపును తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భారత ఆహార సంస్థ దగ్గర ఉన్న బియ్యాన్ని క్వింటాలుకు రూ. 2320 వంతున భారీ సబ్సిడీతో గతంలో ప్రభుత్వం కేటాయించింది. అయితే పెరుగుతున్న ఆహార భద్రత ఆందోళనలు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బియ్యం నిల్వలను కాపాడుకోవాలని, ధరల పెరగకుండా అదుపులో ఉంచడానికి ఈ కేటాయింపులు భారీగా తగ్గించాలని మాజీ అగ్రికల్చరల్ సెక్రటరీ సిరాజ్ హుస్సేన్ సూచించారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర 4.5 మిలియన్ టన్నుల వరకు పప్పుధాన్యాల నిల్వలు ఉన్నాయి. వీటి ధరలను అదుపులో ఉంచడం చాలా అవసరం. ఇదిలా ఉండగా వాతావరణ శాఖ అంచనా ప్రకారం సాధారణ వర్షపాతం 62.1 మిమీ కాగా, జూన్ 15 వరకు 42.4 మిమీ వర్షపాతమే లభించింది. అంటే దేశం మొత్తం మీద 32 శాతం లోటు వర్షపాతం కనిపిస్తోంది. సాధారణంగా దీనిని ఎదుర్కోడానికి కేంద్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా పప్పు ధాన్యాల సాగు చాలా మందకొడిగా ప్రారంభమైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ జూన్ 12 నాటికి పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం 43 శాతం తగ్గిపోయింది. కంది, మినుము, పెసర, వంటి పంటల విత్తనాలు విత్తడం భారీగా పడిపోయింది. కర్ణాటక, మహారాష్ట్రలోని పప్పుధాన్యాల ఉత్పత్తి అత్యధికంగా జరిగే కీలక ప్రాంతాల్లో రైతులు వరుణ కటాక్షం కోసం నిరీక్షిస్తున్నారు. జూన్ 12 వరకు కంది విత్తనాలను 0.09 లక్షల ఎకరాల్లో వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ కంది సాగు విస్తీర్ణం 57 శాతం తక్కువ. మినుములు 0.27 లక్షల ఎకరాల్లో విత్తగా, గత ఏడాది ఇదే సమయానికి 0.35 లక్షల ఎకరాల్లో వేయడమైంది. అంటే 22 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది 1.54 లక్షల ఎకరాల్లో పెసర సాగు చేయగా, ఈ ఏడాది ఇప్పటికి 0.69 లక్షల ఎకరాల్లో విత్తారు. అంటే 55 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. కర్ణాటక ఈశాన్య ప్రాంతం, మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. మహారాష్ట్ర లోని లాతూరు, సోలాపూర్, తెలంగాణ రాష్ట్రంలో బఠానీ పండిస్తారు. లాతూరులో కందిసాగు ఇంకా ప్రారంభం కాలేదు. కర్ణాటకలోని కలబుర్గిలో కొన్ని ప్రాంతాల్లో కొన్ని వారాల క్రితం వర్షాలు పడడంతో పెసర సాగు ప్రారంభించారు. అయితే నాటిన విత్తనాలు నిలదొక్కుకోడానికి వర్షాలు అవసరం. పప్పుధాన్యాలు ప్రధానంగా పండించే మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కంది, మినుము, వంటి పంటల సాగు జులై మధ్య వరకు చేపట్టినా, పంట చేతికి వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుందని రైతులు చెబుతున్నారు.

# పాయకరావుపేట నియోజకవర్గంలో ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాలు

- దొడ్డిగల్లు జంక్షన్ నుంచి వేంపాడు టోల్ ప్లాజా వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ
- ఎన్నికల వరకు పార్టీలు-ఎన్నికల అనంతరం అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయం
- మేము విమర్శలకు ఎప్పుడు భయపడము.
- ఎంతమంది నన్ను ఎన్ని రకాలుగా అవమానించాలనా, నేను వెనకడుగు వేసేదే లేదు.
- నా ధైర్యం నా పాయకరావుపేట ప్రజలు, రాష్ట్ర ప్రజలు,కూటమి నాయకత్వం.
- పాయకరావుపేట అభివృద్ధే నా లక్ష్యం - హోంమంత్రి వంగలపూడి అనిత.



**నక్కపల్లి,(భారత శక్తి)** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళు పూర్తయిన సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గంలో శుక్రవారం విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి మండలం దొడ్డిగల్లు జంక్షన్ నుంచి వేంపాడు టోల్ ప్లాజా వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. అనంతరం భారతి కన్వెన్షన్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో హోంమంత్రి పాల్గొని ప్రసంగించారు. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ అభివృద్ధి, సంక్షేమ స్టాల్స్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, గత రెండేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తాను 2013 వరకు ఒక సాధారణ ఉపాధ్యాయినిగా పనిచేశానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండానే ప్రజల ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. 2014-19 మధ్య ఎమ్మెల్యేగా పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, 2019-24 మధ్య ప్రజా సమస్యలపై పోరాటాలు చేశామని తెలిపారు. 2024 ఎన్నికల్లో పాయకరావుపేట ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 47 వేల మెజారిటీతో గెలిపించారని గుర్తుచేశారు. ప్రజల ఆశీర్వాదం వల్లే మంత్రి పదవి దక్కిందని, ఎక్కడికి వెళ్లినా నియోజకవర్గ అభివృద్ధే తన ఆలోచన అని అన్నారు. రెండేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని హోంమంత్రి వెల్లడించారు. పందూరు వంతెన పనులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, త్వరలోనే వంతెనను ప్రారంభిస్తామని తెలిపారు. సోమిదేపల్లి గ్రామంలో రూ.9 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతోందని, అణుకు గిరిజన గ్రామానికి రూ.3 కోట్లతో రహదారి నిర్మిస్తున్నామని చెప్పారు. అడ్డరోడ్డు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గ యువతకు 20 వేల ఉద్యోగాలు కల్పిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రి నారా లోకేష్ చేసిన కృషిని కొనియాడుతూ, రైతుల త్యాగాలతోనే ఆ పరిశ్రమ సాధ్యమవుతుందని చెప్పారు. ఉపమాక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, సీఎస్ఆర్ నిధులతో ఉపమాక చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. ఆలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారని తెలిపారు. ఎన్నికల వరకు మాత్రమే పార్టీలు ఉంటాయని, ఎన్నికల అనంతరం అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమని హోంమంత్రి స్పష్టం చేశారు. విమర్శలకు భయపడేది లేదని, ప్రజల కోసం ఎన్ని అవమానాలైనా భరిస్తానని చెప్పారు. తన ధైర్యం పాయకరావుపేట ప్రజలు, రాష్ట్ర ప్రజలు, కూటమి నాయకత్వమేనని పేర్కొన్నారు.సభలో అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో ఉమ్మడి విశాఖ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హోంమంత్రి అనిత ఎన్నో ప్రజా పోరాటాలు చేశారని కొనియాడారు. ఆమె నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో
# పాల్గొన్న అదనపు కలెక్టర్

**- వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన**



**భారత శక్తి, జూన్ 19 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, పాత సామగ్రి, ఇతర ఉపయోగించని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలోని కిచెన్ షెడ్, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సక్రమంగా తొలగింపు, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ కళ్లెం జహంగీర్, పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల రక్షణకు భరోసా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి) మహిళలు, చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు, అత్యాచారాలు, ఫోక్సో కేసుల బాధితులకు సమగ్ర సహాయం అందించేందుకు భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు. బాధితులకు వైద్య, న్యాయ, మానసిక, పునరావాస మరియు ఆర్థిక సహాయాన్ని ఒకే వేదికపై అందించే విధంగా భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.భరోసా కేంద్రం ద్వారా బాధితులకు మెడికో-లీగల్ పరీక్షలు, కౌన్సిలింగ్, న్యాయ సహాయం, తాత్కాలిక ఆశ్రయం, పునరావాస సేవలు అందించబడతాయని తెలిపారు. అలాగే ౹ూజుూ మరియు అత్యాచార కేసుల బాధితులకు ప్రభుత్వం కల్పించే పరిహారం (Compensation) అందించేందుకు జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవా సంస్థ (DLSA), పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతో చర్యలు చేపడతారని వివరించారు.కేసుల దర్యాప్తులో దర్యాప్తు అధికారులు బాధితుల హక్కులను పరిరక్షిస్తూ, చట్ట ప్రకారం నిర్దేశించిన గడువుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. బాధితులకు పరిహారం, న్యాయ సహాయం, పునరావాసం వంటి సేవలు అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని ఆదేశించారు.అలాగే జిల్లా విద్యాశాఖ, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు (NGOs), మున్సిపల్ పరిధిలోని మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ (MEPMA), జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ (DCPU), బాలల సంక్షేమ కమిటీ (CWC), జువెనైల్ జస్టిస్ బోర్డు (JJB), సఖీ కేంద్రం తదితర సంస్థలు మహిళలు, చిన్నారుల రక్షణ మరియు పునరావాస కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నాయని తెలిపారు.మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు భయపడకుండా పోలీసులను, భరోసా కేంద్రాలను లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, సూచించారు.ఈ సమావేశంలో ఎస్పీ జానకి శర్మిల, డీసీఐఆర్బీ ఎస్ఐ సంజీవ్, డీసీఐఆర్బీ సీఐ కిరణ్, డీఎస్పీ మురళి, సీడబ్ల్యూసీ సభ్యులు శ్రీలత, అనిల్ కుమార్, సైమన్, చైల్డ్‌లైన్ విభాగం కౌన్సిలర్ మరియు కోఆర్డినేటర్, ఎన్జీఓ ప్రతినిధులు, భరోసా కేంద్ర ఇన్‌చార్జ్ ఎస్ఐ నరసయ్య, భరోసా కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### భైంసాలో మీడియా ప్రతినిధులతో
# సబ్-కలెక్టర్ సమావేశం

**- (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించిన సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి) ముధోల్ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈ ఆర్ ఓ), భైంసా సబ్-కలెక్టర్ సంకేత్ కుమార్, ఆధ్వర్యంలో సబ్-కలెక్టర్ కార్యాలయంలో మీడియా మిత్రులు, పాత్రికేయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ (SIR) కార్యక్రమంపై సమగ్రంగా చర్చించారు. SIR కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం, అమలు విధానం, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా తీసుకుంటున్న చర్యల గురించి సబ్-కలెక్టర్ వివరించారు. కార్యక్రమానికి సంబంధించిన సందేహాలను పాత్రికేయులు అడిగి తెలుసుకునే అవకాశం కల్పించగా, వాటికి సబ్-కలెక్టర్ స్పష్టమైన వివరణలు, సమాధానాలు అందించారు. ఈ సందర్భంగా SIR ప్రక్రియకు సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకు జు=హా మరియు ూాజు=హా కార్యాలయాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటరు జాబితాల సవరణకు సంబంధించి ఏవైనా సందేహాలు, సమస్యలు లేదా సమాచారం అవసరమైన వారు ఆయా హెల్ప్ డెస్క్‌లను సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.ప్రజలకు సరైన సమాచారం చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న సబ్-కలెక్టర్, స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ కార్యక్రమంపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని మీడియా ప్రతినిధులను కోరారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వాములు కావడం ద్వారా ఎన్నికల వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతుందని ఆయన అన్నారు.ఈ సమావేశంలో ఎన్నికల శాఖ అధికారులు, మీడియా ప్రతినిధులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి.**






**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి)** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ వీసీ లో భాగంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాలలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారంల పంపిణీ, తిరిగి స్వీకరణ, తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. బూత్ లెవెల్ అధికారులకు తప్పనిసరిగా అన్ని అంశాలపై అవగాహన ముఖ్యమన్నారు. జిల్లాల వారిగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు చేపట్టిన చర్యలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాల వివరాలు కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం కలెక్టర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఈ వీసీ లో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను మొత్తం పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ప్రక్రియకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని వివరించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అందరం కలిసి నియోజకవర్గంలో ఆసినీతిని తగ్గిద్దాం..

- **రూపాయి ఖర్చు లేకుండా నేనే అభివృద్ధి పనుల మంజూరు పత్రాలను అందిస్తున్న..**
- **పని చేసే అవకాశాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలి..**
- **ఎక్కడా రూపాయి అవినీతికి ఆస్కారం ఉండవద్దు..**
- **నా స్థాయిలో నేను ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా పని చేస్తున్నా..**
- **ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేయాలి..**
- **మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**






**జనగామ (భారత శక్తి)జూన్ 19:** స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని 7మండలాలలోని వివిధ గ్రామాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబందించి సుమారు 13 కోట్ల విలువైన ఈ.జీ.ఎస్ మరియు ఎస్.డి.ఎఫ్ నిధుల మంజూరు పత్రాలు అలాగే పలు గ్రామాలకు సంబందించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శ్రీహరి ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులకు, లబ్ధిదారులకు పంపిణి చేశారు. 74 గ్రామాలలో 103పనులకు 8కోట్ల 55లక్షల విలువైన ప్రొసీడింగ్స్ మరియు 87మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు 4కోట్ల 35లక్షల విలువైన సాంక్షన్ ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోజు ఒకేసారి 13కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు మంజూరు పత్రాలు పంపిణి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సర్పంచ్ లకు ఎలాంటి ఇబ్బందులు, అవినీతికి ఆస్కారం ఉండవద్దని తానే స్వయంగా పనులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మంజూరు అయిన పనులను ఎక్కడ అవినీతికి అవకాశం ఇవ్వకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులుగా మన ప్రజలు నమ్మకం పెట్టుకున్నారని నేనైనా, సర్పంచులు అయిన బాధ్యతగా, జవాబుదారితనంగా పని చేయాలనిఅన్నారు. నా స్థాయిలో నేను ఒక్క లంచం తీసుకోకుండా పని చేస్తున్నాని మీరు స్థాయిలో అంతే నిజాయితీగా పని చేయాలని తెలిపారు. గ్రామాలలో సమస్యలను గుర్తించి ప్రజల అవసరాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా పనులు చేయాలని వెల్లడించారు. పని చేసే అవకాశాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజల మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, వారి కష్ట సుఖాలలో భాగస్వాములు కావాలని సూచించారు. మనందరం కలిసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో సాధ్యమైనంత వరకు తగ్గిద్దామని పిలుపునిచ్చారు. మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని, ఇప్పుడు రెండో విడతలో 2000వేల ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని తెలిపారు. మొదటి విడతలో పూర్తి స్థాయిలో మంజూరు చేసుకున్నామని అన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి స్థానంలో రాష్ట్రంలో 3వ స్థానంలో ఉన్నామని వెల్లడించారు. నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ సాయంతో ఎంతో చక్కగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేసుకుంటున్నారని, ఆ ఇండ్లను చుస్తే కడుపు నిండుగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచులు మీ మీ గ్రామాలలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరుశీలించాలని, లబ్ధిదారులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకొవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. లబ్ధిదారులే స్వయంగా నా వద్దకు వచ్చి సమస్యలు చెబితే ఆ సర్పంచులు పని చేయని వారిగానే పరిగణిస్తానని తెలిపారు. మెదటి విడత ఇందిరమ్మ ఇండ్లను 100శాతం పూర్తి చేసిన వారికే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని స్పష్టం చేశారు. అలాగే గ్రామాలలో మంజూరు అయిన గ్రామ పంచాయతీ భవనాలు, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడీ భవనాలు, మహిళా సమాఖ్య భవనాలు, కమ్యూనిటీ హాల్లు, సిసి రోడ్ల నిర్మాణం అవుతున్నాయా, ఆగిపోయాయా, ఆగితే ఎందుకు ఆగిపోయిందో తెలుసుకోవాలని తెలిపారు. ఆగిపోయిన పనులను రాజకీయాలకు అతీతంగా పూర్తి చేసుకుందామని వెల్లడించారు. గ్రామానికి మంజూరు అయిన పనులన్నింటిని పూర్తి చేస్తే ఆ గ్రామానికి అదనంగా మరో 10లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వర్షాకాలం వస్తుందని గ్రామాలలో పారిశుధ్యం పనులను పక్కాగా నిర్వహించాలని, అలాగే విద్యుత్, త్రాగు నీరు, వీధి దీపాలు వంటి సమస్యలు లేకుండా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, పిఏసీఎస్ చైర్మన్ కర్ణాకర్ రావు, హన్మకొండ, జనగామ జిల్లాల హౌసింగ్ పిడిలు, ఎంపిడివోలు, ఇతర అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, గుర్రం ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిది బెల్దే వెంకన్న, జిల్లా నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో బీఎల్‌వోలతో సబ్ కలెక్టర్ సమావేశం

**- ప్రత్యేక సారాంశ సవరణ ప్రక్రియపై అవగాహన**
**- భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్**




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి )** భైంసా. ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్‌వో), భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆధ్వర్యంలో శుక్రవారం భైంసా పట్టణానికి చెందిన బూత్ లెవల్ అధికారులతో (బి ఎల్ ఓ ) ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక సారాంశ సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ - ాౡ×=) కార్యక్రమం అమలు, ఓటరు జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన మరియు ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాల సవరణ తదితర అంశాలపై బీఎల్‌వోలకు సబ్ కలెక్టర్ సమగ్రంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.ఓటరు జాబితా పరిశుద్ధత, పారదర్శకత కోసం బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సవరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం ముధోల్ నియోజకవర్గ పరిధిలో ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు చేపడుతున్న ఎస్ ఐ ఆర్. ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ పంపిణీ చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల శాఖ అధికారులు, సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం

**- రాహుల్ గాంధీ కుటుంబం మంత్రి అడ్లూరి**
**- ధర్మపురిలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు**




**జగిత్యాల, జూన్ 19 (భారత శక్తి ప్రతినిధి):** దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నంది చౌరస్తాలో నిర్వహించిన రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించారని తెలిపారు. దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను గుర్తు చేశారు.ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ సోనియా గాంధీ ఆ పదవిని స్వీకరించకుండా డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను ప్రధానమంత్రిగా నియమించారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.దేశ ఐక్యత కోసం ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని, 2029లో ఆయనను ప్రధానమంత్రిగా చూడాలని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, తిరుపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN
శనివారం, జూన్ 20, 2026

# రాజకీయ రసకందాయంలో ములుగు జిల్లా కోర్టు జిపి నియామకం...?

**- దళిత న్యాయవాదికి ఇచ్చిన హామీ వెనక్కి..**




**ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 19(భారతశక్తి):**ములుగు జిల్లా గవర్నమెంట్ ప్లీడర్(జిపి) నియామకం వ్యవహారం రాజకీయంగా వేడెక్కింది.ఒక దళిత న్యాయవాదికి తొలుత సిఫార్సు చేసిన అధికార పార్టీ ఎమ్మెల్యే,అనంతరం అదే సిఫార్సును వెనక్కి తీసుకొని మరో బిసి సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదికి మద్దతు ఇచ్చారనే ఆరోపణలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. విశ్వసనీయ సమాచారం మేరకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓ దళిత న్యాయవాది గవర్నమెంట్ ప్లీడర్ పదవి కోసం ఎమ్మెల్యేను సంప్రదించగా ఆయన సిఫార్సు లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఆ లేఖ సచివాలయంలో సమర్పించిన అనంతరం తనకు నియామకం ఖాయమనే ఆశతో ఉన్న సమయంలో పరిస్థితులు మారిపోయినట్లు ఆయన వర్గాలు చెబుతున్నాయి.ఇదే సమయంలో గత ప్రభుత్వ హయాంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పని చేసిన ఓ బిసి సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది కోసం తీవ్ర స్థాయిలో లాబీయింగ్ జరిగినట్లు సమాచారం.ఈ ప్రక్రియలో అదే సామాజిక వర్గానికి చెందిన ఓ ప్రముఖ న్యాయవాది కీలక పాత్ర పోషించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అంతేకాకుండా,తొలుత దళిత న్యాయవాదికి ఇచ్చిన సిఫార్సు లేఖను పక్కనపెట్టి, కొత్త సిఫార్సు లేఖను ఫైల్‌లో చేర్చే ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంలో ఫైల్ టాంపరింగ్ జరిగిందా? లేదా? అనేది అధికారికంగా తేలాల్సి ఉంది.మరోవైపు జిపి పదవికి పోటీలో ఉన్న బీసీ న్యాయవాది ఫోన్ ద్వారా తనను దుర్భాషలాడుతూ బెదిరించాడని దళిత న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఆ కేసు విచారణలో పెద్దగా పురోగతి కనిపించడం లేదని స్థానిక న్యాయవాదులు అభిప్రాయ పడుతున్నారని వినికిడి.ఈ పరిణామాల నేపథ్యంలో దళిత న్యాయవాది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.తనకు ముందుగా అవకాశం చూపించి, చివరికి దూరం చేశారని ఆయన సన్నిహితుల వద్ద వాపోయినట్లు తెలిసింది.అనంతరం దళిత నాయకులను,ప్రజా ప్రతినిధులను కలిసి న్యాయం చేయాలని తను గోడు వెళ్లబోసుకున్నారని సమాచారం.

ఇదే విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా,ఎంపీ స్పందించి పూర్తి వివరాలు తెలుసుకుని తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఈ పరిణామాల నేపథ్యంలో ఒక ప్రశ్న రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా,గత ప్రభుత్వ పాలనలో కీలక బాధ్యతలు నిర్వహించిన వ్యక్తులకు స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఎందుకు అండగా నిలుస్తోంది.? అనే ప్రశ్నకు సమాధానం ఏమిటని కాంగ్రెస్ శ్రేణులు,దళిత సంఘాలు చర్చించుకుంటున్నాయి.ములుగు జిపి నియామకం ఇప్పుడు కేవలం ఒక న్యాయవాది నియామక వ్యవహారం కాకుండా, రాజకీయ ప్రభావం,సామాజిక సమీకరణాలు, దళిత ప్రతినిధిత్వం వంటి అంశాల చుట్టూ తిరుగుతున్న చర్చగా మారింది.ప్రభుత్వం చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ములుగులో ఆసక్తికరంగా మారింది.

# ఘనంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..

**- కేక్ కట్ చేసి వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి.**



**జనగామ(భారత శక్తి)జూన్ 19:** స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, బావి భారత ప్రధాని రాహుల్ గాంధీ గారి పుట్టినరోజు వేడుకలలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తున్న గొప్ప నాయకులు రాహుల్ గాంధీ గారని వెల్లడించారు. దేశంలో అణగారిన వర్గాలపై, మహిళల పై, పేద ప్రజలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, బాధితులకు అండగా ఉంటూ పార్లమెంట్ లో గళం విప్పుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా స్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని అధికారం తమకే శాశ్వతం అన్నట్లుగా ప్రాంతీయ, జాతీయ పార్టీలను చీల్చుతూ ఇక మాకు ఎదురు లేదు అన్నట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో మాకు ఎదురే లేదు అన్నట్లు వ్యవహరించిన కేసీఆర్ కేసీఆర్ ప్రజలు ఏ విధంగా గుణపాఠం చెప్పారో రానున్న ఎన్నికలలో బీజేపీ పార్టీకి, మోడీ ప్రభుత్వానికి అదే రీతిలో ప్రజలు గుణపాఠం చెబుతారని వెల్లడించారు. రానున్న లోక్ సభ ఎన్నికలలో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని, రాష్ట్రంలో మరోసారి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఆ దిశగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికునిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, గుర్రం ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిది బెల్దే వెంకన్న, జిల్లా నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# "పల్లె దీపం... కారోబార్"..

**- కారోబార్ల కష్టాలు తీరేదెన్నడు.- కారోబార్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి:కందిపాటి నాగరాజు.**

**- తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి. - కల్వల గ్రామ బిల్ కలెక్టర్.**



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 19(భారత శక్తి):**పల్లెకు దీపంలా 24 గంటల పాటు గ్రామ ప్రజల కోసం అనునిత్యం పనిచేస్తూ, పరితపించే కారోబార్లు అనేక కష్టాలతో జీవితాలు గడుపుతున్నారు. నెలకు వచ్చే అరకొర జీతం, అది కూడా కొన్నిసార్లు నెలల తరబడి రాదు. ఒకవైపు ప్రభుత్వ నిబంధనలు, మరోవైపు స్థానిక రాజకీయాల మధ్య కారోబార్ నలిగిపోతుంటాడు.ఊరి జనం కోసం ఇంటి పన్ను, నీటి పన్నులు వసూలు చేయడం వీరి పనే. డబ్బులు అడిగితే ఊరి జనం "మాకేం సదుపాయాలు చేశారని కట్టాలి?" అని కారోబార్‌పైనే ఎగబడతారు. తెల్లవారు జామున వీధి దీపాలు బంద్ చేయడం దగ్గరి నుండి, అర్ధరాత్రి బోర్ మోటార్ పాడైతే బాగు చేయించడం వరకు సెలవు లేని బతుకు కారోబార్లది. చాలా మంది దశాబ్దాలుగా టెంపరరీగా, తక్కువ వేతనానికే పని చేస్తూ పర్మనెంట్ అవుతామనే ఆశతోనే సగం జీవితం గడుపుతున్నారు. గ్రామ పంచాయతీలో కారోబార్లు ఆలస్యంగా వచ్చే అల్ప జీతాలతో, రెండు రాళ్ల మధ్య నలిగే బతుకు వెళ్లదీస్తున్నారు. 24 గంటల డ్యూటీ చేస్తున్న కనీసం గుర్తింపు లేదని, ఎన్నో ఏళ్లుగా గ్రామ పంచాయతీలో పని చేస్తున్న వారిని ఇప్పటికైనా ప్రభుత్వం క్రమబద్ధీకరించి, పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని కేసముద్రం మండలం కల్వల గ్రామ బిల్ కలెక్టర్ గా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కందిపాటి నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు.

# బూర్గంపాడులో పిడిఎస్ బియ్యం పట్టివేత

**- ఆంధ్రా నుండి చత్తీస్గడ్ తరలిస్తూ పట్టుబడ్డ లారీ**



**బూర్గంపాడు, జూన్ 19 (భారతశక్తి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలో 30 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని ఎస్సై మేడ ప్రసాద్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మండల కేంద్రంలో ఎస్సై మేడ ప్రసాద్ తన సిబ్బంది తో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఒడి30ఈ4221 గల లారీని పరిశీలించగా అందులో అక్రమ పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్రమ పిడిఎస్ బియ్యంను ఆంధ్రప్రదేశ్ నుండి చత్తీస్గడ్ కు తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ తెలిపారన్నారు. లారీలో సుమారుగా 28 నుండి 30 టన్నుల పిడిఎస్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. లారీని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి పూర్తి సమాచారం తెలుసుకునేందుకు విచారణ చేపట్టామని ఎస్సై మీడియాకు తెలిపారు.

# ప్రైవేటు పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాల ముద్దు

**- తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన మర్రిగూడెం సర్పంచ్**

**- అందరికీ ఆదర్శంగా నిలిచిన బోదాసు స్వప్న జగన్**



**భారత శక్తి, జూన్ 19 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):**యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలం మర్రిగూడెం గ్రామ సర్పంచ్ బోదాసు స్వప్న జగన్ లు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి ప్రైవేటు పాఠశాలు వద్దు అని ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం తన ముగ్గురు పిల్లలు వంగపల్లిలో ప్రైవేట్ పాఠశాలలు చదువుతున్నటువంటి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగింది. అదేవిధంగా మిగతా పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లకుండా మన గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాల బస్సులు గ్రామంలో విద్యార్థులను తీసుకపోకుండా బస్సులు అడ్డుకొని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని నిరసన వ్యక్తం చేసినారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇందుకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ ను ఆదర్శంగా తీసుకొని ప్రజలందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గంతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టం మంత్రి అడ్లూరి

**- పొలాసలో విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**





**జగిత్యాల, జూన్ 19 (భారత శక్తి ప్రతినిధి):** శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల మండలం పొలాస గ్రామంలోని సహస్రలింగాల దేవాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు.ఈ

సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తర్వాత ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు కరువు కాటకాలు రాకుండా, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ఆడువాల జ్యోతి, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకర ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం



**జగిత్యాల, జూన్ 19 (భారత శక్తి ప్రతినిధి):** జిల్లా కేంద్రంలోని శ్రీకర ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ధర్మపురి పట్టణానికి చెందిన ఓ మహిళ తీవ్ర కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరగా, వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి ఆమె కడుపులో ఏడు కిలోలకు పైగా బరువున్న కణతి ఉన్నట్లు నిర్ధారించారు.అనంతరం సర్జన్ డాక్టర్ శ్రీకాంత్, స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించి కణతిని విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.ఇంత పెద్ద పరిమాణంలో కణతులు కనిపించడం చాలా అరుదని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఇలాంటి సమస్యలను గుర్తించి చికిత్స అందించవచ్చని వైద్యులు సూచించారు.

# హలో కార్మిక. చలో మహబూబ్ నగర్

**- తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలను జయప్రదం చేయండి**




**వికారాబాద్ జూన్ 19 భారత శక్తి** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం శుక్రవారం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్ ఆధ్వర్యంలో యాలాల మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో, కార్మికుల తో కలిసి మహాసభల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20,21,22 మహబూబ్ నగర్ పట్టణం లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభలకు జిల్లా లోని వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు . మహాసభలలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాలు, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు, కూలీల భద్రతకు చేయాల్సిన భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకుంటామన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిధిగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ , వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విజయ్ రాఘవాన్ , బి. వెంకట్ , రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాల్లో ఉన్న అంగన్ వాడి టీచర్స్ హెల్పర్స్ ఆశ వర్కర్స్ గ్రామపంచాయతీ వర్కర్స్ మున్సిపల్ వర్కర్స్ హమాలి కార్మికులు ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి. రత్నం, డి.రాజ్ కుమార్, ఆరిఫ్, శివ,చంద్రప్ప, నర్సిములు, షేబ్బీర్, నారాయణ, సరస్వతి, శ్యామమ్మ,తదితరులు ఉన్నారు.

**గుమ్మడిదలలో మూడు కోట్ల 13 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు**

# శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**గుమ్మడిదల జూన్ 19 భారత శక్తి** గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో మూడు కోట్ల 13 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఉదయం మున్సిపల్ పాలకవర్గం తో కలిసి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు అభివృద్ధికి దశల వారీగా నిధులు మంజూరు చేస్తూ..అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలకు జవాబుదారిగా పనిచేసినప్పుడే వారి మన్ననలు పొందుతామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో




పాటు..స్థానిక పరిశ్రమల ద్వారా సి ఎస్ ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. అనంతరం గుమ్మదలలో నిర్మించిన ముదిరాజ్ సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేపు జూన్ 21న అంతర్జాతీయ యోగా మహోత్సవం

**- హాజరు కానున్న ఎమ్మెల్యే, అధికారులు**

**తాండూరు జూన్ 19 భారత శక్తి** అంతర్జాతీయ యోగ దినోత్సవం ఈ నెల 21న పురస్కరించుకొని యోగా చేద్దాం అందరం ఆరోగ్యంగా ఉందాంఅనే నినాదంతో పతంజలి యోగ సమితి తాండూరు శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యోగ అభ్యసన కార్యక్రమాలు మరియు యోగ పై అవగాహన చేపట్టనున్నట్లు అధ్యక్ష,కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ తెలిపారు. తాండూరు పట్టణంలోని విలియం మూన్ హైస్కూల్ మైదానంలో ఆదివారం ఉదయం 6గంటలకు యోగ దినోత్సవ అభ్యసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి, తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఆర్డీఓ అనిత, మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, కౌన్సిలర్లు, నేతలు, అధికారులు, అన్ని పార్టీల నాయకులు, విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. అదే విధంగా యోగ అభ్యసన కార్యక్రమాల అనంతరం రక్త ధాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయగలరని పతంజలి యోగ సమితి తరపున కోరుతున్నాం.


పతంజలి యోగ సమితి
తాండూరు శాఖ
తేది. 21-6-2026 ఆదివారము రోజు పతంజలి యోగ సమితి తాండూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక విలియం మూన్ గ్రౌండ్ నందు ఉదయం 5-30 ని॥లకు "అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని "సామూహిక యోగ అభ్యసన" కార్యక్రమాన్ని నిర్వహించుచున్నాము.
ఇట్టి కార్యక్రమానికి...
ముఖ్య అతిథి : గౌ॥ శ్రీ బుయ్యని మనోహర్‌రెడ్డి గారు (శాసన సభ్యులు, తాండూరు)
సభాధ్యక్షులు : గౌ॥ శ్రీ జి. ప్రవీణ్‌కుమార్ గురూజీ గారు (అధ్యక్షులు & శిక్షకులు పతంజలి యోగ సమితి, తాండూరు)
విశిష్ఠ అతిథులు : గౌ॥ శ్రీమతి పట్లోళ్ళ నీరజ బాల్‌రెడ్డి గారు (చైర్‌పర్సన్, పురపాలక సంఘం, తాండూరు)
గౌ॥ శ్రీ పట్లోళ్ళ నర్సిములు గారు (చైర్మెన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, తాండూరు)
గౌరవ అతిథులు : గౌ॥ శ్రీమతి కె. అనిత గారు (R.D.O. తాండూరు డివిజన్)
గౌ॥ శ్రీ నర్సింగ్ యాదయ్య గారు (D.S.P. తాండూరు డివిజన్)
గౌ॥ డా॥ జయప్రసాద్ గారు (అధ్యక్షులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తాండూరు)
గౌ॥ శ్రీ పి. రాకేష్‌రెడ్డి గారు (మున్సిపల్ కమీషనర్, తాండూరు)
గౌ॥ శ్రీ ఈ. శ్రీధర్‌రెడ్డి గారు (గౌరవ అధ్యక్షులు పతంజలి యోగ సమితి, తాండూరు)
గౌ॥ శ్రీ బోయ అనిల్ గారు (6వ వార్డు కౌన్సిలర్, తాండూరు)
విచ్చేయుచున్నారు. కావున యోగ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మనవి.
యోగసమితి ఆధ్వర్యంలో కార్యస్థలములో రక్తదాన శిబిరము ఏర్పాటు చేయనైనది. ఆసక్తిగలవారు పేర్లు నమోదు చేసుకోగలరు
భవదీయ
ఎ. లక్ష్మణ్
ప్రధాన కార్యదర్శి
ఫోన్ : 9948738373

## శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి దేవస్థానంలో ఘనంగా వికారి శ్వారి క్రతు జీవహోత్సవ ఆహ్వాన కార్యక్రమం



**కాప్రా, జూన్ 19 ,భారతశక్తి:** మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని మంగపురం లో గోదాదేవి రంగనాథ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వికారి శ్వారి క్రతు జీవహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా , ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు అతిథులకు సాదర స్వాగతం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడిన ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధార్మిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిసింది.

## వర్షాకాలం ఆకస్మిక వరదల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి)వర్షాకాలం ఆకస్మిక వరదలు సంభవిస్తే ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు ఎన్డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించి జిల్లా ప్రజలకు ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే వారి సహాయం కొరకు ఎన్డీఆర్ఎఫ్ బృందం పనిచేయాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం మొత్తానికి అవసరమైన వసతి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వర్షాకాలం మొత్తం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్ఓ రమేష్ రాథోడ్, ఆర్డిఓ దేవిదాస్ ఎన్డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ జిడి ముఖేష్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై 11 ఏళ్ల బాలుడితో కారు డ్రైవింగ్..

**హైదరాబాద్,(భారత శక్తి)** పుత్రోత్సాహం మంచిదే, కానీ పిచ్చికి పరాకాష్టగా మారితేనే ప్రమాదాలు తప్పవు. హైదరాబాద్‌లో ఓ తండ్రి కొడుకు మీద పిచ్చి ప్రేమతో టీనేజ్ కూడా లేని కొడుకు చేతికి కారు స్టీరింగ్ ఇచ్చి డ్రైవింగ్ చేపించి సంబరపడ్డాడు. సీన్ కట్ చేస్తే జైలుకు వెళ్లి ఊచలు లెక్కించాల్సి వచ్చింది.ఔటర్ రింగ్ రోడ్ అంటేనే వాహనాలు అత్యంత వేగంగా దూసుకెళ్లే దారి. బాధ్యులు ఎవరైనా, ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోతాయి. అలాంటి ప్రమాదకరమైన ఓఆర్ఆర్ పై ఓ తండ్రి అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాడు. తన 11 ఏళ్ల కుమారుడికి ఖరీదైన కారు స్టీరింగ్ ఇచ్చి డ్రైవింగ్ చేపించి మురిసిపోయాడు. తాను ఎంత పెద్ద తప్పు చేస్తున్నాను, చట్టప్రకారం అది ఎంతటి తీవ్రమైన నేరమనే విషయాన్ని మరిచిపోయి చిక్కుల్లో పడ్డాడు.రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ సీహెచ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. టోలీచౌకీ ప్రాంతానికి చెందిన అబ్దుల్ హాదీ ఇటీవల ఓ ఖరీదైన కారు కొన్నాడు. జూన్ 11వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఔటర్ రింగ్ రోడ్డు పై శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వెళ్లే మార్గంలో తన మైనర్ కుమారుడికి నడిపేందుకు కారును ఇచ్చాడు. కనీసం టీనేజ్ కూడా లేని ఆ బాలుడు అర్ధరాత్రి వేళ ఓఆర్ఆర్‌పై కారును డ్రైవ్ చేశాడు.అదే సమయంలో ఆ దారిలో మరో కారులో వెళ్తున్న ఓ వ్యక్తి బాలుడు డ్రైవింగ్ చేయడం చూసి ఆశ్చర్యపోయాడు. బాలుడు కారు నడుపుతుండగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ వీడియో ఇంటర్నెట్‌ను షేక్ చేసింది. పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా ఆ వీడియోను ట్రాఫిక్ పోలీసుల అధికారిక ఖాతాకు ట్యాగ్ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.ఆ వైరల్ అయిన వీడియో ఆధారంగా రాజేంద్రనగర్ పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు చేపట్టారు. నిఘా ఉంచి కారు నంబర్ ఆధారంగా యజమాని అబ్దుల్ హాదీని గుర్తించారు. డ్రైవింగ్ చేసింది అతడి 11 ఏళ్ల కుమారుడనే విషయం విచారణలో తెలడంతో పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాలుడి తండ్రిని అదుపులోకి తీసుకున్నారు. అత్యంత వేగంగా వాహనాలు దూసుకెళ్లే రహదారిపై బాలుడికి కారు ఇచ్చి తమ ప్రాణాలతో పాటు ఇతర వాహనదాలు ప్రాణాలు ప్రమాదంలోకి నెట్టేలా ప్రవర్తించడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ తండ్రి అబ్దుల్ హాదీపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ వెల్లడించారు.

# భీమవరంలో పీఐబీ వార్తాలాప్ ను ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల పరివర్తనాత్మక పాలనపై ప్రత్యేక చర్చ**






విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 19: కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ప్రాంతీయ కార్యాలయం విజయవాడ ఆధ్వర్యంలో భీమవరంలో జిల్లా మరియు గ్రామీణ పాత్రికేయుల కోసం ఒక రోజు మీడియా ఔట్రీచ్ వర్క్‌షాప్ 'వార్తాలాప్'ను కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈరోజు ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 12 ఏళ్ల సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను దేశవ్యాప్తంగా అందరికీ చేరువ చేసేందుకు నిర్వహిస్తున్న కార్యకలాపాలలో భాగంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ గడిచిన పన్నెండేళ్లలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, మహిళా సాధికారత, డిజిటల్ గవర్నెన్స్, ఆర్థిక చేరిక మరియు సామాజిక సంక్షేమం వంటి రంగాలలో భారత ప్రభుత్వం సాధించిన అద్భుతమైన విజయాలను కొనియాడారు. ప్రభుత్వ విధానాలు, పథకాలు లక్షలాది మంది పౌరుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చాయని, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి బలమైన పునాది వేశాయని ఆయన పేర్కొన్నారు.ప్రజాస్వామ్య సమాజంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమైందని కేంద్ర మంత్రి అన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఖచ్చితమైన, వాస్తవ సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. జిల్లా, గ్రామీణ విలేకరులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక వారధిలా పనిచేస్తారని, లబ్ధిదారులలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. రాజ్యసభ సభ్యులు (ఎంపీ) పాక వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రైతు సంక్షేమమే భారత ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధిని మెరుగుపరచడం వంటి వివిధ కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు.
పీఐబీ విజయవాడ డైరెక్టర్ జి. సురేష్ కుమార్ పాత్రికేయులను ఉద్దేశించి మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, నిర్ణయాలపై నమ్మకంగా, సకాలంలో సమాచారాన్ని అందించడం ద్వారా ప్రభుత్వానికి, పాత్రికేయులకు మధ్య పీఐబీ ముఖ్యమైన వారధిలా పనిచేస్తుందని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మీడియాకు వివిధ ప్రతిష్టాత్మక పథకాలు, అభివృద్ధి కార్యకలాపాలపై మరింత అవగాహన కల్పించడానికి సహాయపడతాయని అన్నారు. భీమవరం ఎంపీఈడీఏ ప్రాంతీయ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ ఆనంద్ మాట్లాడుతూ ఆక్వాకల్చర్ సాగులో ప్రభుత్వ కార్యక్రమాల ప్రాముఖ్యత, స్థిరమైన వృద్ధికి ఉన్న అవకాశాల గురించి పాత్రికేయులకు వివరించారు. లబ్ధిదారులు, రైతు వర్గాలలో అవగాహన కల్పించడంలో మీడియా పాత్రను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ వర్క్‌షాప్ ముగింపులో ఒక ఇంటరాక్టివ్ సెషన్ (సందేహాల నివృత్తి కార్యక్రమం) నిర్వహించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విలేకరులు నిపుణులతో పరస్పరం తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# కందుకూరు మండలంలో ఘనంగా డబుల్ లేన్ రహదారి పనుల శంకుస్థాపన

**- మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో రవాణా వ్యవస్థ బలోపేతానికి శ్రీకారం..**

**- హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు!**

**కందుకూరు, జూన్ 19 (భారత శక్తి ప్రతినిధి):** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కందుకూరు మండలంలో రహదారుల విస్తరణకు, రవాణా రంగ పురోభివృద్ధికి సరికొత్త అడుగు పడింది. మండల పరిధిలోని లేమూరు, బేగంపేట, తిమ్మాపూర్ గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ద్విమార్గాంతర (డబుల్ లేన్) రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.

### కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా భూమిపూజ

ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, శాస్త్రోక్తంగా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన మెరుగైన రహదారి సౌకర్యాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

### - తరలివచ్చిన రాజకీయ ప్రముఖులు



ఈ శంకుస్థాపన మహోత్సవంలో శాసనమండలి ప్రభుత్వ ప్రధాన విప్ (చీఫ్ విప్) పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు (ఎంపీ) కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారితో పాటు రోడ్డు అభివృద్ధి సంస్థ (రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధ్యక్షుడు మల్ రెడ్డి రాంరెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ శాసనసభ్యుడు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితర కీలక నేతలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు.

### - నియోజకవర్గ ప్రగతికి సరికొత్త మార్గం

ఈ ద్విమార్గాంతర రహదారి పూర్తి కావడం వల్ల లేమూరు, బేగంపేట, తిమ్మాపూర్ గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. వాణిజ్య, రవాణా రంగాలు మరింత వేగవంతం కానున్నాయని స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రోడ్డు భవనాల శాఖ అధికారులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో స్థిరాస్తి జోరు

**- బంజారాహిల్స్, హకీంపేట్ భూముల వేలానికి భారీ స్పందన**

**హెచ్ఎండీఏ ప్రీ-బిడ్ సమావేశానికి తరలివచ్చిన కొనుగోలుదారులు.. పారదర్శక విధానంపై ప్రశంసల జల్లు!**



హైదరాబాద్ జూన్ 19 (భారత శక్తి ): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల ఈ-వేలం ప్రక్రియకు రియల్ ఎస్టేట్ రంగం నుండి అద్భుతమైన స్పందన లభించింది.

నగరంలోని అత్యంత విలాసవంతమైన ప్రాంతాలైన బంజారాహిల్స్, హకీంపేట్‌లలో ఉన్న ప్రభుత్వ భూముల అమ్మకానికి సంబంధించి శుక్రవారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో ముందస్తు ధరల ప్రతిపాదన (ప్రీ-బిడ్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 50 మందికి పైగా ప్రముఖ నిర్మాణదారులు, కొనుగోలుదారులు హాజరై తమ ఆసక్తిని కనబరిచారు.

### - నగర ప్రగతి-వ్యూహాత్మక ప్రయోజనాలపై వివరణ

సమావేశంలో భాగంగా ప్రముఖ ఆస్తి సలహా సంస్థ జేఎల్ఎల్ ప్రతినిధి సందీప్ దృశ్య శ్రవణ ప్రదర్శన (పవర్‌పాయింట్ ప్రజెంటేషన్) ద్వారా భూముల ప్రత్యేకతలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టి, హైదరాబాద్ నగర అప్రతిహత వృద్ధిని ఆయన ప్రస్తావించారు. వేలానికి సిద్ధంగా ఉన్న భూముల భౌగోళిక ప్రాధాన్యత, రవాణా సౌకర్యాలు, ఆయా ప్రాంతాల్లో భవిష్యత్తులో రాబోయే భారీ అభివృద్ధి అవకాశాలను కొనుగోలుదారులకు కూలంకషంగా వివరించారు.

### - డిజిటల్ వేలంపై అవగాహన

అనంతరం ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ నిర్వాహకుడు జమీల్ అక్తర్ అంతర్జాల వేలం (ఈ-వేలం) విధానంపై ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. సాంకేతిక ప్రక్రియ, బిడ్డింగ్ పద్ధతులు, నిబంధనలను వివరించిన ఆయన, కొనుగోలుదారుల మనస్సులో ఉన్న పలు సందేహాలను నివృత్తి చేశారు. డిజిటల్ పద్ధతిలో సాగే ఈ వేలం ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

### - అధికార యంత్రాంగం పర్యవేక్షణ




ఈ ఉన్నత స్థాయి సమావేశంలో హెచ్ఎండీఏ ప్రధాన ఇంజనీర్ బి. రవీందర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ రజిత, ప్రధాన ప్రణాళికా అధికారులు ఎ. రవీందర్ రెడ్డి, బి. ప్రసాద్ రావు పాల్గొని వేలం ప్రణాళికలను పర్యవేక్షించారు. వీరితో పాటు సికింద్రాబాద్ డివిజన్ రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిరామ్, హెచ్ఎండీఏ ఉప కలెక్టర్ వై. సుదర్శన్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రామారావుతో పాటు ఎస్టేట్స్, ప్రజాసంబంధాలు, ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు హాజరై ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### - సానుకూల వాతావరణంలో ముగింపు

ప్రభుత్వం అవలంబిస్తున్న పారదర్శక వేలం విధానాన్ని, ఈ ప్రాజెక్టుల ద్వారా లభించే విప్లవాత్మక అభివృద్ధి అవకాశాలను హాజరైన ప్రతినిధులు ముక్తకంఠంతో అభినందించారు. అత్యాధునిక మౌలిక వసతులతో కూడిన ఈ భూముల కొనుగోలుకు గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అత్యంత సానుకూల వాతావరణంలో జరిగిన ఈ ముందస్తు బిడ్ సమావేశం విజయవంతంగా ముగిసింది.

# క్యాన్సర్ పై రోబోటిక్ గెలుపు

## -తక్కువ నొప్పి ఎక్కువ జీవన ప్రమాణాలు: డాక్టర్ రాజేష్ గౌడ్




మంచిర్యాల ప్రతినిధి, జూన్ 19( భారత శక్తి): రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్ర చికిత్సలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని యశోద హాస్పిటల్ సర్జికల్ అంకాలజిస్ట్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం రోజున జిల్లా కేంద్రంలోని ప్రముఖ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లోరైసిస్ గైడెడ్,రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శాస్త్ర చికిత్సల విప్లవాత్మక మార్పులపై వివరించారు. పెద్ద కోతలు లేకుండా కేవలం 8ఎం ఎం చిన్న రంధ్రాల ద్వారా ఆపరేషన్ చేయగలుగుతారని పేర్కొన్నారు. రోబోటిక్ టెక్నాలజీతో తక్కువ నొప్పి,తక్కువ మచ్చులు,తక్కువ రక్తనష్టం కలుగుతుందని తెలిపారు. హై డెఫినేషన్,త్రీ డి విజన్, ట్రిమ్మర్ ఫ్రీ ఇన్స్టుమెంట్, మనిషి చేతి కదలికలను అనుకరించే విస్టేడ్ ఇన్స్టుమెంట్ ద్వారా క్లిష్టమైన శస్త్ర చికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చునని తెలిపారు.ఈ ఆధునిక టెక్నాలజీలతో అత్యంత ఖచ్చితత్వం తక్కువ టిష్యూ డ్యామేజ్ ,తక్కువ రక్త నష్టం ,వేగవంతమైన కోలుకున్న అవకాశాలు ఉంటాయని అన్నారు.అంతేకాక క్యాన్సర్ రోబోటిక్ శస్త్ర చికిత్స క్యాన్సర్ నయం చేయడమే కాదు,రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం కూడా ఆధునిక శస్త్ర చికిత్సల లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

## -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి )వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలంతా బాధ్యతగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మామడ మండలం లింగాపూర్ తండాలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలువురు అధికారులు, విద్యార్థులతో కలిసి సామూహికంగా మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలంతా విరివిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడే ఈ మహా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని వివరించారు. అంతకుముందు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్రంగూడా ఈకో పార్కును ప్రారంభం చేసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన కార్యక్రమాన్ని, మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో కలెక్టర్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ శ్రీనివాస్, రైతులు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ప్రత్యేక చొరవతో సత్వరమే


## న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హామీ



జనగామ(భారత శక్తి)జూన్ 19: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నల్ల వీరబాలరాజు తండ్రి రామచంద్రం వైద్య మరియు ఆరోగ్య శాఖలో సోషల్ వర్కర్ పోస్టు కు దరఖాస్తు చేసుకోగా, గత సంవత్సరం మే 2025 లో అప్పటి జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి, జనగామ గొల్లపల్లి వెంకన్న బాబు తండ్రి అక్కులు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందినవారు. సదరు అభ్యర్థి ఎంపిక సమయములో కీర్తి పబ్లిక్ స్కూల్, కొడకండ్ల యందు 1 నుండి 9 వ తరగతి వరకు చదివినట్లుగా ఒకసారి, మరొకసారి, 1 నుండి 7 వ తరగతి వరకు చదివినట్లుగా స్టడీ సర్టిఫికెట్ సమర్పించారు. ఇట్టి సర్టిఫికెట్ ను మండల విద్యాధికారి, కొడకండ్ల అట్టి అభ్యర్థి చదివాడో లేదో అని తెలుసుకోకుండానే అట్టేస్ట్ చేశారు.ఇట్టి విషయమై జనగామ జిల్లా కలెక్టర్ వీరబాలరాజు చూపించిన గొల్లపల్లి వెంకన్న బాబు కి సమర్పించిన సర్టిఫికెట్ ఫేక్ అని తేల్చి, ఇట్టి విషయమై తగు విచారణ జరిపించి వీరబాలరాజుకు న్యాయం జరిగేలా చేస్తానని సానుకూలంగా స్పందించారు.ఈ మేరకు కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఇట్టి సమస్యకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి జిల్లా పరిపాలన కట్టుబడి పనిచేస్తోందనడానికి ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన, వేగవంతమైన స్పందనతో ప్రజావాణి కార్యక్రమం ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుతోంది.

# రూ. 25 వేలు లంచం తీసుకుంటూ..

## ఏసీబీకి చిక్కిన విద్యుత్ అడిషనల్ ఏఈ




భారత శక్తి ప్రతినిధి , జూన్ 19 బొల్లారం (సంగారెడ్డి ): లంచం తీసుకుంటూ టీజీఎస్పీడీసీఎల్ అదనపు ఏఈ బి. రామకృష్ణారెడ్డి గురువారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక బాధితుడు తన కారుతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రామకృష్ణారెడ్డి రూ. 25 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత సొమ్ము ఇచ్చుకోలేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి ప్లాన్ ప్రకారం బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా అధికారులు ఏఈని పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, హైదరాబాద్ కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

# నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు






కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 19: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలో కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దేశ ప్రజలకు, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయక నాయకుడిగా సేవలందిస్తున్నారని కొనియాడారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని పలువురు వృద్ధులకు అన్నదానం నిర్వహించి మానవతా సేవా కార్యక్రమాలు చేపట్టారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి,పండ్ల రాజు, ఇప్ప శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, గుడుగుల శీను, పుట్నాల శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, కన్నయ్య, సాయిలు, రామ్మోహన్, గంగాధర్, అంజద్, జావీద్, వాజిద్, రాజు, ప్రతిభ రమేష్, అస్రార్, ఖుర్షీద్ , ప్రకాష్, రాజబాబు గౌడ్ , ప్రవీణ్ రెడ్డి, రాజా గౌడ్, సిరాజుద్దీన్, అన్వర్ అహ్మద్, లడ్డు, జమీల్, అజ్మత్, కిరణ్, భీమ్ రెడ్డి, కళ్లెం సత్యం, వెంకట్రావు, యాదవ రెడ్డి, సిద్ధిక్, హనుమాన్ల రామ్ కుమార్, ప్రవీణ్, ప్రదీప్, రఫీ, ప్రవీణ్, పాత దివ్య , హనుమాన్లు, అనిల్, టింకు భరత్, లక్క పతిని గంగాధర్, సురేష్, ముబాషిర్, అలీ, సుమ, సుఫియాన్ , చిట్టిబాబు, నరేష్, భాస్కర్, అనిల్, మమ్మద్ కైఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# 50 వేల మెగా డీఎస్సీ ఉద్యోగాలు ఏమయ్యాయి?

- ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి?
- ఉద్యోగాలపై యువత ఆశలతో ప్రభుత్వం ఆటలాడుతోంది
-కేసీఆర్ హయాంలో 1.62 లక్షల ఉద్యోగాలు భర్తీ..
-సాంకేతికతను ఉపయోగించుకుని లక్ష్యాలను చేరుకోవాలి
-రాకేష్ రెడ్డి గారి సేవలు నిరుద్యోగులకు ఆదర్శం
-వ-జశ్రీఘంంతీశీశిఎ యాప్ ను ప్రారంభించిన
ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.




జనగామ(భారత శక్తి)జూన్ 19: తెలంగాణలో 50 వేల మెగా డీఎస్సీ ఉద్యోగాలంటూ గతంలో నిరుద్యో గులకు హామీలు ఇచ్చారని, ఆ పోస్టులు ఏమయ్యాయి. తాము అధి కారంలోకి వస్తే ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్, రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం పై జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఒకే సారి 16 వేలు, 17 వేల చొప్పున భారీగా నోటిఫికేషన్లు పోలీస్ శాఖలో ఇచ్చామని, కేవలం పోలీస్ శాఖ లోనే దాదాపు 48 వేల పోస్టులు భర్తీ చేసామని ఆయన గుర్తుచేశారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన రాకేష్ రెడ్డి వ-జశ్రీఘంంతీ శీశిఎ మొబైల్ యాప్‌ను అంబే ద్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

**ఎమ్మెల్యే పల్లా గారి మీడియా పాయింట్స్:**

రాకేష్ రెడ్డి తనకున్న ఉన్నత చదువు, జ్ఞానంతో ఉద్యోగ అభ్యర్థులకు సహాయం చేయాలనే ఆలోచనతో ఈ డిజిటల్ యుగంలో ఇంట్లోనే ఉండి చేతిలో చదువుకోవడానికి వీలుగా సమాచారాన్ని ఈ యాప్‌లో పొందుపరిచారు. ఇందుకు సహకరించిన చక్రవర్తి గారికి, రాకేష్ రెడ్డి గారికి అభినందనలు. విద్యార్థులంతా ఈ యాప్‌ను ఉప యోగించుకుని వారి పేరు గుర్తుపెట్టుకోవాలి. తాను 40 ఏళ్ల క్రితం సోడాశపల్లి అనే చిన్న గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివాను. ఆ తర్వాత ఉస్మా నియా యూనివర్సిటీలో చదువుకున్నానని గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో విద్యార్థులకు ఉన్న ఏకైక సోర్స్ టీచర్ మాత్రమే. టీచర్ ఏం చెప్తే అదే విద్య, దానిపై ఎలాంటి డిస్కషన్ ఉండేది కాదు. లైబ్రరీ లలో పుస్తకాలు, సమాచారం, మెటీరియల్ చాలా తక్కువగా ఉండేవి. అప్పట్లో అద్భుతమైన టీచర్లు ఉండేవారు. ఈనాడు ఉన్న కార్పొరేట్ శక్తులు ఒకే పేరుతో ఇంటర్మీడియట్ లోనే టీచర్లను విడగొట్టారు. టీచర్ యొక్క గుర్తింపును ఈ కార్పొరేట్ శక్తులు తీసేశాయి. టీచర్ ఏం చెప్తున్నారనే దానికంటే టీచర్ల దగ్గర నుంచి పిల్లలు ఏం నేర్చుకున్నారనేది ముఖ్యం. నాడు టీచర్ చెప్తే వేదంగా భావించేవారు, కానీ నేడు టీచర్లు క్లాస్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నాడు టీచర్ మాత్రమే సోర్స్ కాగా...నేడు రాకేష్ రెడ్డి గారు ఇన్ఫ ర్మేషన్ మొత్తాన్ని ఒక పూసలాగా గుచ్చి విద్యార్థుల చేతుల్లోకి తీసుకు వచ్చారు. మనకు చదువు, జ్ఞానం ఉంటేనే సమాజంలో విలువ ఉంటుంది. సబ్జెక్టు, నాలెడ్జ్ ఉంటే మీకు ఏ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అవసరం లేదు. సబ్జెక్టు, లాంగ్వేజ్ రెండూ ప్రెసెంట్ చేయగలిగితే ఏ ఉద్యోగమైనా కొట్టొచ్చు. చదువుకునే సమయంలోనే కష్టపడి చదువుకోవాలి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఐటీ ఉద్యోగాలు, అనేక ప్రైవేట్ పరిశ్ర మలలో ఉద్యోగాలు వస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కచ్చితం గా కొట్లాడుదాం. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో ఖాళీలను నింపడం మన హక్కు, వాటి కోసం పోరాడుదాం.గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఉద్యోగాలు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు మాట్లాడింది. తాను రెండు సార్లు ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు వరంగల్‌లోని అనేక యూనివర్సిటీలు, కాలేజీలకు వెళ్లి మాట్లాడాను.ఏ రాష్ట్రంలోనైనా, దేశంలోనైనా వారి ఆర్థిక పరిస్థితి, అవసరాన్ని బట్టి ప్రభుత్వ ఉద్యోగాలు జనాభాలో కేవలం 1శాతం నుండి శాతం లోపే ఉంటాయి. ఇవి ప్రజలకు సేవలు అందేందుకే ఉంటాయి. గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదనడం పచ్చి అబద్ధం.తాను 9 ఏళ్లు ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు అనేకమంది నిరుద్యోగ సంఘాల మిత్రులు తన దగ్గరికి వస్తే, వారిని మంత్రుల దగ్గరకు, సీఎం దగ్గరకు తీసుకువెళ్లి నోటిఫికేషన్లు ఇప్పించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత ప్రభుత్వం మూడు సార్లు నోటిఫికేషన్లు ఇచ్చి 47వేల అని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసింది. వయసు పెంపు, రన్నింగ్ పోటీ పరీక్షల ఇబ్బందులను తొలగించి నిరుద్యోగులకు మేలు చేయడంలో ముందున్నాం.ప్రస్తుతం పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో 20 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, ఈ ప్రభుత్వం కేవలం 4 లేదా 5 వేలు మాత్రమే ఎందుకు ఇస్తోం దని ప్రశ్నిస్తున్నాను.యువత రెండేళ్లగా రాత్రింబగళ్లు కష్టపడి ఉద్యోగం వస్తుందనే ధీమాతో ప్రిపేర్ అవుతుంటే, వారిపై నీళ్లు చల్లినట్లు ఈ తక్కువ పోస్టులు ఇవ్వడం ఏంటి?2014 తర్వాత ప్రతి పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ఇచ్చింది, పరీక్షలు నిర్వహించింది, రిజల్ట్స్ ఇచ్చింది అంతా కేసీఆర్ ప్రభుత్వమే. చిన్న చిన్న లోపాల వల్ల ఆగిపోయిన ఆ రిక్రూట్‌మెంట్‌కు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం నియామక పత్రాలు (పట్టాలు) ఇచ్చింది తప్ప, కొత్తగా ఒక్క పోలీస్ ఉద్యోగం కూడా ఇవ్వలేదు.తండాలు, గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి వస్తే 'మెగా డీఎస్సీ' ఇస్తామని, ఒకేసారి 50 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఉద్యోగాలు ఇవ్వట్లేదని ఒక అమ్మాయి ఓటు వేయనని కూడా చెప్పిం ది. కానీ అధికారంలోకి వచ్చాక డీఎస్సీ పేరు చెప్పి మోసం చేశారు. గతంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 8 వేల టీచర్ల ఉద్యోగాలను ఫిల్ అప్ చేశాం.తెలంగాణలో వెయ్యికి పైగా గురుకులాలు ఓపెన్ చేసి, వాటికి 25 వేల ఉద్యోగాలు అవసరమైతే 2014 నుండి 2023 వరకు గత ప్రభుత్వం 12 వేల గురుకుల ఉద్యోగాలను (ఎస్సీ, ఎస్టీ) నింపింది. ఇంకో 6 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్నాం. మార్చి తర్వాత మరో 4 వేల ఉద్యోగాలు వస్తాయని చెప్తే నమ్మలేదు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక గతంలోని 6 వేల ఉద్యోగాల నోటి ఫికేషన్‌ను క్యాన్సిల్ చేసి, దానికి కేవలం 5 వేలు యాడ్ చేసి మొత్తం 11 వేలు మాత్రమే ఇచ్చారు. 50 వేల డీఎస్సీ ఇస్తామని చెప్పి నిరుద్యోగు లను మోసం చేశారు.మొన్న అసెంబ్లీలో మేము జాబ్ క్యాలెండర్ గురించి అడిగాం. మ్యానిఫెస్టోలో చెప్పినట్లు ఏ ఏ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి, ఏ నెలలో నోటిఫికేషన్ ఇస్తారు, ఏ నెలలో రిజల్ట్స్ ఇస్తారు, ఏ నెలలో ఆర్డ ర్స్ ఇస్తారో మెన్షన్ చేయాలన్నాం. మేము అమరుల స్తూపం వద్దకు వెళ్తుంటే పేపర్లు గుంజుకున్నారు, అసెంబ్లీ ముందు బైఠాయించి వెంటపడితే.. చివరకు ఖాళీలు, డేట్లు ఏవీ లేకుండా కేవలం ఒక నల్ల కాగితం మీద రాసి తూతూమంత్రంగా జాబ్ క్యాలెండర్ ఇచ్చారు.మొన్న సీఎం అసెంబ్లీ వేదికగా 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్తే మేము ప్రశ్నించాం. 2023 తర్వాత ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని అడి గితే కేవలం 12 వేల ఉద్యోగాలకే ఇచ్చామని ఒప్పుకున్నారు. నిరుద్యోగులను నిత్యం మోసం చేస్తున్నారు. దిల్ సుఖ్ నగర్, అశోక్ నగర్, వరంగల్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎంతో మంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో ఉద్యోగాల కోసం ఎదురుచూ స్తున్నారు.నిరుద్యోగుల కోసం అసెంబ్లీ లోపల మేము, అసెంబ్లీ బయట మా విద్యార్థి విభాగంతో పాటు రాకేష్ రెడ్డి గారు ఆనాటి నుంచి ఈనాటి వరకు నిర్భయంగా కొట్లాడుతున్నారు. రాజకీయంలో ఎంతోమంది వస్తుంటారు పోతుంటారు. నిరుద్యోగులకు పైసలు కావా లన్నా..వారి తరఫున నిలబడాలన్నా రాకేష్ రెడ్డి ముందుంటున్నారు. 2014 నుండి 2023 వరకు కేసీఆర్ గారు ఇచ్చిన ఉద్యోగాలు 1.62 లక్షలు. కానీ ఈ ప్రభుత్వం ఇచ్చింది కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్ర మే, అవి కూడా గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లే తప్ప కొత్తవి కావు. గత ప్రభుత్వంలో ఉన్న ఒకే ఒక్క మిస్టేక్ గ్రూప్-1 పేపర్ లీక్ కావడం. ఆ లీకేజీతో బాధ్యత ఉన్నా లేకున్నా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను తొలగిం చాలని అందరం కోరినాం.ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడి చెప్పారు. కానీ మొన్న బీజేపీ ఎంపీలు, మంత్రులు మాట్లాడుతూ ఉద్యోగాలతో పాటు ఉపా ధి కూడా కల్పిస్తున్నామని, ఆ ఉద్యోగాల కింద ఉపాధిని కూడా లెక్కే సుకోమని చెప్పడం చాలా దురదృష్టకరం. యువత ప్రభుత్వ ఉద్యోగాలు కోరుకోవడంలో తప్పు లేదు.ఐటీ రంగంలో తెలంగాణ, తెలుగు ప్రజలు యూఎస్ఏ లోనూ, ఇక్కడా సంపాదిస్తున్నారు. గత ప్రభుత్వం 2014లో 3 లక్షల ఐటీ ఉద్యోగాలతో ప్రయాణం మొదలుపెట్టి 2023 నాటికి వాటిని 10 లక్షలకు పెంచింది. కానీ ఈ మూడేళ్లలో ఒక్క ఐటీ ఉద్యోగం కూడా రావడం లేదు..ఉన్న చిన్న చిన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతున్నాయి. యూనివర్సిటీల్లో కొత్తగా ఎలాంటి కోర్సులు ప్రవేశపెట్టలేదు.కాకతీయ యూనివర్సిటీ లో పలువురు ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని అడుగు తున్నారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం టెంపరరీ పేరు మీదున్న 1020 మంది ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని జీవో తీసుకొస్తే..ఆర్జేఏసీ (ఆరోగ్యంల్ సంస్థ/నిరుద్యోగ సంస్థ) కోర్టుకు వెళ్లి అడ్డుపడింది. ఆనాటి నుండి ఈనాటి వరకు దాన్ని అడ్డుకున్నారు. ఈ రిక్రూట్‌మెంట్‌లో ఒక్క జూనియర్ డిగ్రీ పోస్టు కూడా ఫిలప్ చేయలేదు, గతంలో చేసింది కేసీఆర్ ప్రభుత్వమే.

ఆనాడు మాట్లాడిన కోదండరామ్ ఎటు పోయాడు? తీన్మార్ మల్లన్న ఎటు పోయాడు? అకునూరి మురళి ఎటు పోయారు? వరంగల్ గురిం చి మాట్లాడిన వారంతా ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారు? అని ప్రశ్నించారు.వరంగల్ యువత ఉద్యమాల్లో ఏనాడూ వెనకడుగు వేయలేదు. నాడు సమ్మక్క-సారలమ్మ పౌరుషం, రాణి రుద్రమదేవి పౌరుషం, చాకలి ఐలమ్మ త్యాగం, దొడ్డి కొమురయ్య మొదటి అమరత్వం స్ఫూర్తితో మన ఉద్యోగాలు, నోటిఫికేషన్ల కోసం కచ్చితంగా కొట్లాడాల్సి న అవసరం ఉంది.వరంగల్‌కు ఇష్టమైన బతుకమ్మను తెలంగాణ తల్లి చేతిలో నుంచి మాయం చేశారు. మన కాకతీయ చిహ్నాన్ని కూడా ప్రభుత్వ చిహ్నాల నుండి తప్పించారు.ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం చదువుతో పాటు అడుగులో అడుగు వేసి పోరాడుదాం. రాకేష్ రెడ్డి చేస్తున్న ఇటువంటి సామాజిక సేవలు నిరంతరం కొనసాగాలని కోరుకుంటున్నాను.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



మంచిర్యాల ప్రతినిధి జూన్ 19 (భారత శక్తి):కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షురాలు సురేఖమ్మ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే నివాసంలో పట్టణ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 56వ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఆదాని సిమెంట్ కంపెనీ యూనియన్ అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్ రావు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముల నరేష్ ,కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, NSUI నాయకులు , యూత్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్లకు నూతన పరికరాలను అందజేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,






నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి )జిల్లా పోలీసు శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేయడం, ప్రజలకు వేగవంతమైన,సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు నూతన సాంకేతిక పరికరాలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అందజేశారు.ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు బార్‌కోడ్ స్కానర్లు, లేబుల్ ప్రింటర్లు, సింగిల్ డిజిట్ స్కానర్లు, ఫింగర్ ప్రింట్ బ్యూరో సిస్టమ్స్, ఫింగర్ ప్రింట్ స్కానర్లు, ప్రింటర్లను పంపిణీ చేశారు.ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో కేసుల సంఖ్య పెరగడం, కంప్యూటర్లు, ట్యాబ్‌ల సాంకేతిక సమస్యల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా కోర్టు కేసుల వివరాలను వేగవంతంగా నమోదు చేయడం, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు సమన్వయ అధికారులు,ప్రాసిక్యూషన్ అధికారులకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించడం ద్వారా న్యాయ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీటి సహకారం అందనుంది.

### పరికరాల ప్రాధాన్యత

వేలిముద్ర (ఫింగర్ ప్రింట్) స్కానర్లు: వ్యక్తుల గుర్తింపును ధృవీకరించడం, నేర చరిత్రను గుర్తించడం, అనుమానితుల వివరాలను తక్షణమే సేకరించడం మరియు పెండింగ్ కేసుల ఛేదనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.సింగిల్ డిజిట్ స్కానర్లు: పోర్టబుల్ బయోమెట్రిక్ పరికరాలైన ఇవి వ్యక్తుల గుర్తింపును క్షణాల్లో ధృవీకరించడంతో పాటు కేంద్రీకృత డేటాబేస్‌లతో సరిపోల్చి నేర చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి.బార్‌కోడ్ స్కానర్లు: ముద్రించిన బార్‌కోడ్‌లను డిజిటల్ సమాచారంగా మార్చి రికార్డుల నిర్వహణ, సాక్ష్యాల ట్రాకింగ్ మరియు ఇతర పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేస్తాయి.లేబుల్ ప్రింటర్లు: కేసు ఫైళ్లు, సాక్ష్యాధారాలు మరియు ఇతర రికార్డులను ఖచ్చితంగా గుర్తించి నిర్వహించడంలో కీలకంగా ఉపయోగపడతాయి. తెలంగాణ పోలీస్ శాఖలో సాక్ష్యాల భద్రత, రికార్డుల నిర్వహణలో ఇవి ముఖ్యమైన సాధనాలుగా పని చేయనున్నాయి.జిల్లా పోలీస్ శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేసి, ప్రజలకు వేగవంతమైన మరియు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పరికరాలను అందజేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు.ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఏఓ యూనస్ అలీ, ఇన్స్పెక్టర్లు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి,సమ్మయ్య, ఆర్.ఐ (అడ్మిన్) రామ్ నిరంజన్ రావ్ ,ఎస్సైలు జీ.లింబాద్రి , శ్రీకాంత్, రవీందర్ , గణేష్ , గోపి, శ్రావణి, హన్మండ్లు , డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి )ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం రాత్రి, పట్టణంలోని రామ్ నగర్ బాలికల ఆశ్రమం వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, పాఠశాలలో మొత్తం విద్యార్థులు, నేటి వరకు హాజరైన విద్యార్థులు, వారికి కల్పిస్తున్న వసతులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని పూటలా నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలను అడిగి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతి ఒక్కరు కష్టపడి చదవాలన్నారు. సబ్జెక్టుల్లో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

# ప్రకృతి సమతుల్యంగా ఉంటేనే మనుగడ సాధ్యం.

- ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి.
- నాటిన మొక్కలను సంరక్షించి వృక్షాలుగా చేయాలి.
- ప్రకృతిని మనం కాపాడితేనే ప్రకృతి మనల్ని కాపాడుతుంది.
- వన్యప్రాణులు జనావాసాలలోకి రాకుండా పండ్ల మొక్కలు నాటాలి.
- ఘనపూర్ కస్తూరిభా గాంధీ పాఠశాలకు కోటి 45లక్షలు మంజూరు.
- ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను కుడా తీసుకోవాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి







జనగామ(భారత శక్తి)జూన్ 19: స్టేషన్ ఘనపూర్ మండలం నమిలిగొండ గ్రామ పరిధిలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కుబడిగా మొక్కలు నాటకుండా నాటిన మొక్కలను పరిరక్షించి వాటిని వృక్షాలుగా చేసే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. గత 10ఏళ్లుగా ఈ కార్యక్రమం ద్వారా నాటిన మొక్కలలో 50శాతం మొక్కలు కూడా కాపాడలేక పోయమని అన్నారు. ఈ రోజు పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలన్నింటిని కాపాడాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచించారు. అలాగే వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలను కాపాడే విధంగా అటవీ శాఖ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ప్రకృతితోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని వెల్లడించారు. అడవులు తగ్గిపోవడం వల్ల వాతావరణంలో మార్పులు ఏర్పడి ప్రకృతి వైరీత్యాలు ఏర్పడుతాయాన్ని పేర్కొన్నారు. అలాగే వన్య ప్రాణులు పంట పొలాలు నాశనం చేయడం, జనావాసాలోకి రావడం జరుగుతున్నాయని తెలిపారు. వన్య ప్రాణులు జనావాసాలలోకి రాకుండా బ్లాక్ ఫారెస్ట్ జోన్ లు ఏర్పాటు చేసి పండ్ల మొక్కలు నాటలని సూచించారు. కావున ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటలని పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ కస్తూరిభా గాంధీ పాఠశాలకు ఇప్పటికే కోటి 45లక్షలు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకే నిధులు కేటాయించినట్లు తెలిపారు. వారం రోజులలో ఆర్.వో వాటర్ ప్లాంట్, హైమాస్ లైట్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. వారంలో ఒకేసారి వాటర్ ప్రారంభోత్సవం, అభివృద్ధి కోటి 45 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తానని వెల్లడించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని స్వంత బిడ్డలుగా చూసుకోవాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరం 100శాతం ఉత్తిర్ణత సాధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోమల, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపిల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, ఆర్డివో, డిఆర్డివో, జిల్లా అటవీ శాఖ అధికారి, తహసీల్దార్, ఎంపిడివో, ఎంఈవో, కస్తూరిభా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఫారెస్ట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో కార్డన్ అండ్ సెర్చ్

**- 121 ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం**

**- నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకం: ఏఎస్పీ సాయి కిరణ్.**





నిర్మల్ జిల్లా, జూన్ 19:( భారత శక్తి) జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు భైంసా పట్టణంలోని పిప్రి కాలనీలో గురువారం పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరాల నియంత్రణ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా అనుమతులు లేకుండా నడుపుతున్న 121 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకుని సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పాల్గొన్న భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, మొబైల్ ఫోన్ మాట్లాడుకుంటూ వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మైనర్ల చేత వాహనాలు నడిపించడం వంటి అంశాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఆస్తి సంబంధిత నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణకు సహకరించాలని, "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజలు ముందుకు రావాలని సూచించారు. పిప్రి కాలనీ జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో వాహనదారులు హైవేపైకి వెళ్లే ముందు జాగ్రత్తగా పరిశీలించి ప్రయాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భైంసా టౌన్ సీఐ పి. సాయికుమార్, ఎస్ఐలు నవనీత్ రెడ్డి, నాగభూషణం, దయాల్ సింగ్, ఇతర పోలీసు సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు. పోలీసులు నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీలు ప్రజల్లో భద్రతా భావనను పెంపొందించడంతో పాటు నేరాల నియంత్రణకు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

## మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

**- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్**



భద్రాచలం, జూన్ 19 (భారతశక్తి): పర్యావరణాన్ని కాపాడుకొనుటకు విరివిగా ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటే వాతావరణం ఆహ్లాదకరంగా ఉండి ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం తన చాంబర్లో ఫారెస్ట్, ఐటిసి, ఎంఎన్ఆర్ఏజిఎస్, గ్రామ పంచాయితీ అధికారులతో కలిసి సారపాక గ్రామపంచాయితీలో లక్షల మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించడానికి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో పర్యావరణం కలుషితం కాకుండా సారపాక గ్రామపంచాయితీ సర్పంచ్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా సంవత్సరానికి 25 వేల మొక్కలు చొప్పున నాలుగు సంవత్సరాలకు లక్ష మొక్కలు నాటలన్నారు. ప్రజలు ఎక్కువగా సంచరించే ఖాళీ ప్రదేశాలలో గోదావరి పరివాహక ప్రాంతాలలో ముఖ్యమైన కూడళ్లలో ప్రజలకు ఉపయోగపడే కార్బన్డయాక్సైడ్ ను పీల్చుకొని ఆక్సిజన్ అందించే మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకునే విధంగా సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. ముఖ్యంగా గానుగ, వేప, చింత, జామ, నేరేడు చెట్లతోపాటు వివిధ రకాల పండ్లకు సంబంధించిన మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమం దిగ్విజయంగా విజయవంతం అవ్వడానికి అధికారులు సహకరించాలని ఆయన సూచించారు. అలాగే ఈ వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేసి గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలలో మనకు ప్రాణవాయువును ప్రసాదించే చెట్లను నాటి వాటిని సక్రమంగా పెంచి వాతావరణం కలుషితం కాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, సారపాక సర్పంచ్ కిషోర్ శివరామ నాయక్, ఫారెస్ట్ డిఆర్ఓ ధారావత్ కృష్ణ, ఐటిసి డిప్యూటీ జిఎం విశ్వనాథం, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**- రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి) భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించి భూ బంధిత దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, జిల్లాల్లో భూధార్ సర్వే చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సర్వేయర్లను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, అలాగే భూభారతి దరఖాస్తులను నిర్ణీత 60 రోజుల గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, భూధార్ సర్వే నిర్వహణకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, సాదాబైనామా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఏడి ల్యాండ్ సర్వేయర్ నరసింహమూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అనంతకు భారీగా పరిశ్రమలు

**అనంతపురం(భారత శక్తి)** ఏపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులపై ఫోకస్ పెట్టింది. అది కూడా ఒక్క జిల్లాకు పరిమితం కాకుండా.. జిల్లాల వారీగా ఓ ప్లాన్ ప్రకారం పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఇటీవల కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు పరిశ్రమలు క్యూ కట్టాయి. పుట్టపర్తి, హిందూపురంతో పాటుగా అనంతపురం ప్రాంతాలకు భారీగా పెట్టుబడులు వచ్చాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని ఏపీకి కంపెనీలు ఎందుకు వస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికల్ని అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకు అనుకూలంగా పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, ఫార్మా పరిశ్రమలు వస్తున్నాయి. కోస్తా జిల్లాలలో సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు, పర్యాటక రంగ అనుబంధ హోటల్స్, పోర్టుల్ని అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సోలార్ ప్లాంట్‌లు, డ్రోన్ సిటీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్ని తీసుకొస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలో కరువు జిల్లాగా పిలిచే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇప్పటికే ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రాగా.. కొంతకాలంగా ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని పుట్టపర్తి, హిందూపురం సహా పలు కీలక ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయి.కర్ణాటకను కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎన్నో అనుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కర్ణాటకకు సరిహద్దులో ఉంది.. అక్కడితో పోలిస్తే అనంతపురం జిల్లాలో భూముల లభ్యత బావుంది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో పాటు అందిస్తున్న ప్రోత్సాహకాలు కూడా కలిసొస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వడం ప్లస్ పాయింట్. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ అనంతపురం జిల్లా సరిహద్దు నుంచి దగ్గరగా ఉంది.. కేవలం రెండు, మూడు గంటలు ప్రయాణం ఉంటుంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి హిందూపురం, పుట్టపర్తి జస్ట్ 2 గంటల్లో చేరుకోవచ్చు. అంతేకాదు పుట్టపర్తిలో ఎయిర్‌పోర్ట్ ఉండటం కూడా కలిసొస్తుంది.. ఇటు రోడ్డు, రైలు సౌకర్యాలు ఉండటం సానుకూలంగా మారింది. అందుకే పారిశ్రామికవేత్తలు పొరుగునే ఉన్న కర్ణాటక కాకుండా సమీపంలోనే ఉన్న అనంతపురం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతున్నారు.


ఏపీ ప్రభుత్వం ముందుగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల్ని గుర్తించి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తోంది. అందుకే పారిశ్రామికవేత్తలు అనంతపురం జిల్లావైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల కోసం వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూముల్ని గుర్తించారు. పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లేపాక్షి, మడకశిర పరిసరాల్లో వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసింది. కర్ణాటకతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు చాలా తక్కువ కావడంతో అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. గతేడాది బెంగళూరులో ఉన్న ఐటీ కంపెనీ సీఈవో కష్టాలు చెప్పుకుంటూ ట్వీట్ చేశారు. మంత్రి లోకేష్ వెంటనే స్పందించి.. ఏపీకి రమ్మని ఆహ్వానించారు. ఆ తర్వాత మంత్రి లోకేష్ అనంతపురాన్ని కొత్త ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా పేర్కొన్నారు. ఏరోస్పేస్, ఇతర పరిశ్రమలకు ఏపీలో 8వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందంటూ ఆహ్వానం పలికారు. లోకేష్ ఇచ్చిన పిలుపు కూడా పరిశ్రమల రాకకు ఓ కారణంగా చెప్పొచ్చు.ఇప్పటికే ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు.. సోలార్, డ్రోన్ పరిశ్రమలు రాగా.. ఇటీవల కేంద్రం నుంచి వచ్చిన యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి మరింత బూస్టప్ ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా తయారు చేయాలని ప్లాన్ చేస్తోంది.. రాబోయే రోజుల్లో మరికొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలో ఉద్యోగాలు, ఉపాధి కోసం బెంగళూరు, కర్ణాటక వెళ్లిన జిల్లా ప్రజలకు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. తాజాగా జిల్లాకు వరుసగా పరిశ్రమల రాకతో మరికొన్ని ఉద్యోగ, ఉపాది అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఇక జిల్లావాసులు ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదంటున్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లా భారీ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. పెనుకొండలో కియా మోటార్స్ కార్ల తయారీ ప్లాంట్ ఉంది. కియాకు అనుబంధంగా మరికొన్ని అంతర్జాతీయ విడిభాగాలు (స్పేర్ పార్ట్స్) కంపెనీలు ఏర్పాటయ్యాయి. రాప్తాడు దగ్గర రేమండ్ గ్రూప్ రూ. 1,200 కోట్ల పెట్టుబడితో ప్లాంట్లు ఏర్పాటు చేయబోతోంది.

హిందూపురం, పెనుకొండ ప్రాంతంలో ప్రముఖ ఇన్నర్ వేర్ బ్రాండ్ అయిన జాకీ తయారీ యూనిట్ వచ్చింది. సరళా ఏవియేషన్ రూ. 1300 కోట్లతో ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (వమూఎ) విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. అలాగే రక్షణ, విమాన పరికారల తయారీకి ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పార్క్ అభివృద్ధి చేయనున్నారు. గిన్‌ఫ్రా ప్రెసిషన్స్ రూ. 1,150 కోట్ల పెట్టుబడితో బైమాడ్యులర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారీ యూనిట్‌ను తిమ్మసముద్రంలో ఏర్పాటు చేస్తోంది. అలాగే హిందూపురం ఇండస్ట్రియల్ ఏరియాలో ఆర్జాస్ స్టీల్ స్టీల్ ఉత్పత్తులను తయారు చేస్తోంది. పుట్టపర్తి సమీపంలో ఆర్‌ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ భారీ సెమీకండక్టర్ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది.పుట్టపర్తి సమీపంలో డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. గత నెలలోనే పుట్టపర్తిలో కేంద్ర ప్రభుత్వం ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది. రూ. 15,803 కోట్లతో యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఏపీ ప్రభుత్వం 600 ఎకరాలను కేటాయించింది. ఈ స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టు ద్వారా దాదాపు 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో దాదాపు రూ. లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. అనంతపురం జిల్లా రాబోయే రోజుల్లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుందని చెబుతున్నారు.

### భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల

## పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

- రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్
- సాదా బైనామా, రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలి.
- రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలి




భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 19 (భారతశక్తి): భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, సాదా బైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమం తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలిస్తూ పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ఐడీఓసీ కాలనీలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. జిల్లాలో భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, రీ-సర్వే, నక్షా కార్యక్రమాల పురోగతిపై వివరాలను రాష్ట్ర అధికారులకు నివేదించారు. ఈ సమావేశంలో ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాసరావు, మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

### నిర్వహించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్ (భారత శక్తి)**మినిస్టర్ క్వార్టర్స్ లో కాంగ్రెస్ అగ్ర నాయకులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే ఒక రాజకీయ నాయకుడు గా మానవతా హృదయం కలిగిన రాహుల్ గాంధీ కు జన్మదిన శుభాకాంక్షలు. భారత్ జోడోయాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా అందరూ కలిసి ప్రజాస్వామికంగా ఉండాలని నఫ్రత్ చోడో భారత్ జోడో అని ఎటువంటి విద్వేషాలతో బతకద్దని పిలుపునిచ్చిన వ్యక్తి. రాహుల్ గాంధీ గారు బావి భారత జన్ జడ్ ఆకాంక్షల ఘనంగా ప్రధాని కావాలి. రాహుల్ గాంధీ గారు భారతదేశానికి దిశా దశ మారుస్తారు. జిత్నే అబాది ఉత్నే ఇసెదరి అని దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలని ఆశతో ఎదురు చూస్తున్న సందర్భంలో రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ గారికి జన్మదిన సందర్భంగా వారికి ఆ భగవంతుడు అన్ని రకాల శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. ..

## పటాన్ చెరు పట్టణంలో హైడ్రా దూకుడు.

**సంగారెడ్డి(భారత శక్తి)** పటాన్ చెరు పట్టణంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ఆధారిటీ ( ఐలా) సంబంధించిన 1599 గజాల స్థలానికి హైడ్రా అధికారులు కంచె వేసారు. ఆదే స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ, కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని నిలుపు చేసి చుట్టు కంచ వేసారు. గురువారం ఉదయమే ఈ స్థలంలో నిర్మిస్తున్న గుడిని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పరిశీలించారు. తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.


### ఆశ్రయ్-ఆకృతి పాఠశాలలో

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**హైదరాబాద్(భారత శక్తి)** శుక్రవారం నాడు జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్ కాలనీలో ఆశ్రయ్-ఆకృతి పాఠశాలలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.దివ్యాంగ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వారికి కేక్ తినిపించి జన్మదిన వేడుకలను ఆనందంగా జరిపారు. వినికిడి, మాటల సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఆశ్రయ్ ఆకృతి సంస్థ అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు.విద్య, వైద్యం, స్కిల్ డెవలప్మెంట్ రంగాల్లో సంస్థ విశేష సేవలు అందిస్తోందన్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది చిన్నారులకు ఈ సంస్థ ద్వారా సహాయం అందుతోందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సంస్థ అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరింత ప్రోత్సాహం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సమాజంలోని ప్రతి చిన్నారికి సమాన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రయ్ ఆకృతి ఫౌండర్ డాక్టర్ డి.పి.కే. బాబు, డైరెక్టర్ శశికళ, ప్రిన్సిపల్ సారిక, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## మానేరు జలాశయాల్లో భారీగా తగ్గిన నీటి నిల్వలు



**కరీంనగర్ (భారత శక్తి)** మానరు జలాశయాల్లో నీటి నిల్వలు భారీగా తగ్గిపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న మానేరు జలాశయాల్లో ఆందోళనకర స్థాయికి నీటినిల్వలు చేరాయి. అప్పర్ మానేరులో 2 టీఎంసీకు గాను 0.661 టీఎంసీలు, మిడ్ మానేరులో 27.5 టీఎంసీకు గాను 7.4 టీఎంసీలు, లోయర్ మానేరులో 24 టీఎంసీలకు గాను 6 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో, ఖరీఫ్ సీజన్ వేళ రైతులు కలవరపడుతున్నారు. దీనికి తోడు ఎల్నినో ప్రభావంతో వర్షాలు తగ్గే సూచనలు కనిపిస్తుండటంతో సాగునీరు, తాగునీటి నీటికి తీవ్ర ఇబ్బందులు తప్పవని అంచనా వేస్తున్నారు.

### అధికారంలో ఉన్నవాళ్లను

## కంగారు పెడుతుందేంటీ..?

**హైదరాబాద్, (భారత శక్తి)**సమస్యల పరిష్కారం కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్ దగ్గరకు ఎందుకు క్యూ కడుతున్నారు,,? ఇంకా మూడేళ్ళ పాలన మిగిలి ఉండగానే ఏంటీ పరిస్థితి మనం ప్రతి రోజు అర్జీలు తీసుకుంటున్నాఎందుకు ఇలా జరుగుతోంది ఎక్కడ తేడా కొడుతోంది? అంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కూటమి వర్గాల్లో ఈ తరహా చర్చలు పెరిగిపోతున్నాయట. సమస్యలు ఉంటే పరిష్కారం కోసం అధికారంలో ఉన్నవాళ్ళ దగ్గరికి రావాలిగానీ ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడిని కలిసి విన్నవించుకోవడం ఏంటంటూ కూటమి నాయకులు ఆలోచనలో పడ్డట్టు తెలుస్తోంది. ఇప్పటికి అయ్యింది.. రెండేళ్ళు మాత్రమే. ఇంకా మూడేళ్ళ పాలన మిగిలే ఉంది. అయినా సరే ఇంత త్వరగా ఎందుకు రియాక్ట్ అవుతున్నారు

వాళ్లకు జగన్ ఎందుకు గుర్తుకు వస్తున్నాడంటూ ప్రభుత్వ పెద్దలు తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. మొన్నటిదాకా అధికారంలో ఉన్న పార్టీ, ప్రస్తుతం పోరుబాట పడుతోంద కాబట్టి ఏవో చిన్నా చితకా ఇబ్బందుల గురించి చెప్పుకుంటే సరేగానీ రకరకాల సమస్యల పేరుతో బాధితులంతా వరుసబెట్టి జగన్‌ను ఎందుకు కలుస్తున్నారంటూ ఆరా తీయడం మొదలైందని చెప్పుకుంటున్నారు.ముందు అమరావతి రైతులు, తర్వాత ఆరోగ్య శ్రీ నిధులపై ఆశా యూనియన్, డీఎస్సీ 2026 పరీక్ష రాసి ఉద్యోగాలు రాని అభ్యర్థులు, రాజమండ్రి కల్తీ పాల బాధితులు, తాజాగా ఆక్వా రైతులు ఇలా సమస్యలు ఉన్నవారంతా వరుసగా జగన్‌ను కలవడం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. అటు డీఎస్సీ విషయంలో వైసీపీ దూకుడుగా వెళ్తోందా.. అనే చర్చ కూడా కూటమిలో జరుగుతోందట. ప్రతి వారం.. టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు, లోకేష్ అర్జీలు తీసుకుంటున్నారని? అదే విధంగా మంత్రులు ఎవరో ఒకరు అందుబాటులో ఉంటున్నారని..అయినాసరే ఇదేం పరిస్థితి అని మాట్లాడుకుంటున్నట్టు సమాచారం. ఒకవేళ జగన్ పిలిపించుకుని మాట్లాడుతున్నారని అనుకుందామనుకున్నా.. ఇలా వరసగా అంతా వెళ్లడాన్ని మాత్రం ప్రత్యేకంగానే చూడాలంటున్నాయి కూటమి వర్గాలు.రెండేళ్ళకే పరిస్థితి ఇలా ఉంటే.. ముందు ముందు ఇంకెలా మారుతుందన్న చర్చలు సైతం నడుస్తున్నాయి. వైసీపీ నిర్వహించి వెన్నుపోటుకు రెండేళ్ళు కార్యక్రమం విజయవంతం అయిందని కూడా కూటమిలో గుసగుసలాడుకుంటున్నారట. వైసీపీ క్యాడర్ పెద్ద సంఖ్యలో బయటకు రావడం, కొన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమం సక్సెస్ అవడం తమకు ఇబ్బందేనని మాట్లాడుకుంటున్నట్టు సమాచారం. ఒకవైపు ప్రతిపక్షం నిర్వహించిన కార్యక్రమం సక్సెస్ అవడం, మరోవైపు వివిధ వర్గాల బాధితులు జగన్‌ను కలవడం కూటమి నేతల్ని ఆలోచనలో పడేస్తోందట. జగన్ దగ్గరకు ఇలాగే బాధితులు క్యూ కడుతుంటే. సమస్యల పరిష్కారం సంగతి తర్వాతగానీ అసలు రాష్ట్రంలో ఇన్ని ప్రాబ్లమ్స్ ఉన్నాయా అన్న చర్చ మొదలవుతుందని, అంతిమంగా అది తమకు నష్టం చేస్తుందన్నది కూటమి నాయకుల భయంగా తెలుస్తోంది

## ప్రమాదకరంగా క్యాట్ ఫిష్

**మహబూబ్ నగర్ (భారత శక్తి)** ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే క్యాట్‌ఫిష్ పెంపకంపై ప్రభుత్వ నిషేధం ఉన్నప్పటికీ వనపర్తి జిల్లాలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఒక్క పెబ్బేరు మండలంలోనే 30కి పైగా అక్రమ చెరువులు వెలిసినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. వీటికి కుళ్లిన చికెన్ వేస్టేజీని ఆహారంగా వేస్తుండటంతో చుట్టుపక్కల పొలాలు దుర్వాసనతో నిండిపోతున్నాయి. తక్కువ ఖర్చుతో కోట్లు సంపాదించవచ్చుననే ఆశతో ఏపీకి చెందిన కొందరు వ్యాపారులు ఇక్కడ చేపలను పెంచి విజయవాడ, వైజాగ్, బెంగళూరులకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పు తెచ్చిపెడుతుందనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాట్‌ఫిష్ (ఆఫ్రికన్ మాగుర్) పెంపకంపై దేశవ్యాప్తంగా కఠినమైన నిషేధం విధించాయి.

అయితే.. చట్టాల పట్ల ఏమాత్రం భయం లేకుండా, అధికారుల కళ్లు గప్పి వనపర్తి జిల్లాలో క్యాట్ ఫిష్ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆసరాగా చేసుకుని.. కేవలం ఒక్క పెబ్బేరు మండలంలోనే 30కి పైగా క్యాట్‌ఫిష్ పెంపకం చెరువులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లోనూ ఈ రకమైన నిషేధిత చేపల చెరువులు జోరుగా సాగుతున్నాయి. గతంలో మత్స్యశాఖ అధికారులు నామమాత్రంగా కొన్ని చెరువులను ధ్వంసం చేసి చేతులు దులుపుకోవడంతో నిర్వాహకులు మళ్లీ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు.వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, పెబ్బేరు మున్సిపాలిటీల పరిధిలోని చికెన్ సెంటర్ల నుంచి సేకరించే వ్యర్థాలను ఈ క్యాట్‌ఫిష్‌లకు ప్రధాన ఆహారంగా వాడుతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రం నుంచే ప్రతిరోజూ దాదాపు 15 మెట్రిక్ టన్నుల చికెన్ వ్యర్థాలను సేకరించేందుకు టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు, ఆ చెత్తను మున్సిపల్ యార్డులకు తరలించకుండా ఈ అక్రమ పెంపకందారులకు అమ్మేస్తున్నారు. సాధారణ దాణా కంటే ఈ కుళ్లిన మాంసాన్ని తినడం వల్ల క్యాట్‌ఫిష్‌లు చాలా తక్కువ కాలంలోనే ఊహించని విధంగా బరువు పెరుగుతాయి. ఇతర రకాల చేపలేవీ ఈ మాంస వ్యర్థాలను ముట్టవు. అయితే.. టన్నుల కొద్దీ చికెన్ వ్యర్థాలను చెరువుల వద్ద కుప్పలుగా వేస్తుండటంతో చుట్టుపక్కల ప్రాంతాలు నరకప్రాయంగా మారుతున్నాయి. తీవ్రమైన దుర్వాసనతో ఊపిరి పీల్చుకోలేకపోతున్నామని, పంట పొలాల్లో పనులు చేసుకోలేకపోతున్నామని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అక్రమ దందాను నడిపిస్తోంది పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు బడా ఆక్వా వ్యాపారులని సమాచారం. వనపర్తిలోనే పదుల సంఖ్యలో చెరువులను లీజుకు తీసుకుని స్థానిక యంత్రాంగాన్ని మేనేజ్ చేస్తూ వీరు కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. సాధారణ చేపలు మార్కెట్లో కిలో రూ. 150 వరకు పలుకుతుండగా.. ఈ క్యాట్‌ఫిష్‌లను హోల్‌సేల్‌గానే కిలో రూ. 100 పైచిలుకు ధరకు అమ్ముతున్నారు. ఇక్కడ పెంచిన చేపలను విజయవాడ, విశాఖపట్నం, రాయలసీమ జిల్లాలతో పాటు బెంగళూరు మహానగరానికి భారీ కంటైనర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. క్యాట్‌ఫిష్‌లను తినడం వల్ల మానవులలో క్యాన్సర్, కాలేయ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి టాస్క్‌ఫోర్స్ రంగాన్ని రంగంలోకి దింపి ఈ చెరువులను శాశ్వతంగా మూసివేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

## తమిళనాడులో అప్పుల భారం

- ప్రతి చిన్నారిపై లక్షా 28 వేలు

**చెన్నై,(భారత శక్తి)** తమిళనాడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి మేరీ విల్సన్ ఈ పత్రంలో వెల్లడించారు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక దుస్థితిని వివరిస్తూనే, మరోవైపు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ రుణమాఫీని సీఎం విజయ్ ప్రకటించారు.రాష్ట్ర ఖజానా పరిస్థితి ఎంత దారుణంగా ఉందో వివరిస్తూ ప్రభుత్వం పలు సంచలన **గణాంకాలను బయటపెట్టింది**:భారీగా అప్పులు: రాష్ట్ర మొత్తం అప్పులు రికార్డు స్థాయిలో రూ.13.18 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందులో డైరెక్ట్ (ప్రత్యక్ష) రుణాలే ఏకంగా రూ.10 లక్షల కోట్ల వరకు ఉన్నాయి.రెట్టింపైన రుణాలు: ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని గత ఐదేళ్ల పాలనలోనే అప్పులు దాదాపు రెట్టింపయ్యాయి. డీఎంకే అధికారంలోకి రాకముందు రూ.4.8 లక్షల కోట్లుగా ఉన్న ప్రత్యక్ష రుణాలు, కేవలం ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లకు పైగా పెరిగాయి.చిన్నారిపై భారం: అప్పుల పెరుగుదల కారణంగా.. ప్రస్తుతం తమిళనాడులో పుట్టే ప్రతి పిల్లాడి తలపై సగటున రూ.1.28 లక్షల రుణ భారం ఉంది.అభివృద్ధి శూన్యం: గత ఆరు దశాబ్దాల్లో చేసిన అప్పులకంటే ఈ ఐదేళ్లలోనే ఎక్కువ అప్పులు చేశారని, వాటిని మౌలిక సదుపాయాల కల్పనకు కాకుండా కేవలం రోజువారీ ఖర్చులకే వినియోగించారని ఆర్థిక మంత్రి మేరీ విల్సన్ తీవ్రంగా విమర్శించారు. బడ్జెటేతర రుణాలు, ప్రభుత్వ గ్యారంటీలు అన్నీ కలుపుకుంటేనే మొత్తం అప్పు రూ.13.18 లక్షల కోట్లకు చేరిందని ఆయన స్పష్టం చేశారు.

**అన్నదాతలకు ఊరట**

రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి విజయ్ రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నారు. సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన కీలక సమావేశం అనంతరం రుణమాఫీని అధికారికంగా ప్రకటించారు. గతేడాది మే 1 నుంచి ఈ ఏడాది (2026) ఫిబ్రవరి 28 మధ్య సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు ఈ మాఫీ వర్తిస్తుంది. వాస్తవానికి గత నెలలో రూ.50 వేల లోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పలు రైతు సంఘాలు ముఖ్యమంత్రిని కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు ఆ పరిమితిని రూ.75 వేలకు పెంచుతూ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ రూ.75 వేల కంటే ఎక్కువ రుణం తీసుకున్న రైతులు ఉంటే, వారికి సైతం ఏకమొత్తంగా రూ.35 వేల వరకు రుణాన్ని మాఫీ చేస్తారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 14.43 లక్షల మంది రైతులుకు లబ్ధి చేకూరనుంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై అదనంగా సుమారు రూ.5,932 కోట్ల భారం పడనుంది.

## దేశంలో కార్ టెక్నాలజీ

- రోడ్డు ప్రమాదాలకు చెక్...

**ముంబై,(భారత శక్తి)** భారతదేశంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆటోమొబైల్ రంగంలో మరో విప్లవాత్మక అడుగు వేసింది. రహదారులపై ప్రయాణించే వాహనాలు ఒకదానితో ఒకటి నేరుగా సమాచారాన్ని పంచుకునే సరికొత్త 'వాహనం-వాహనం కమ్యూనికేషన్' వ్యవస్థ అమలు చేసేందుకు సిద్ధమైంది. ఈ అత్యాధునిక టెక్నాలజీకి సంబంధించిన ముసాయిదా నిబంధనలను కేంద్రం తాజాగా విడుదల చేసింది.ఈ సాంకేతికత ద్వారా రోడ్డుపై వెళ్తున్న వాహనాలు ఒక ప్రత్యేకమైన రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా అనుసంధానమై ఉంటాయి. వాహనాలు తమ వేగం, ప్రయాణిస్తున్న దిశ (లొకేషన్), బ్రేకింగ్ పరిస్థితి వంటి కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీపంలోని ఇతర వాహనాలకు చేరవేస్తాయి. ముందు వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేసినా, రోడ్డుపై మలుపుల వద్ద ఏదైనా వాహనం నిలిచిపోయినా.. ఈ సిస్టమ్ వెంటనే వెనుక వస్తున్న డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది. వాతావరణం అనుకూలించని సమయాల్లో (పొగమంచు/భారీ వర్షం) లేదా డ్రైవర్ కంటికి కనిపించని (బ్లైండ్ స్పాట్స్) ప్రమాదాలను కూడా ముందుగానే పసిగట్టి ఇది అలర్ట్ ఇస్తుంది. దీనికోసం టెలికమ్యూనికేషన్స్ శాఖ ఇప్పటికే ఈ వాహనాల కమ్యూనికేషన్ కోసం ఒక ప్రత్యేకమైన రేడియో ఫ్రీక్వెన్సీని కేటాయించడం గమనార్హం.ఈ సరికొత్త సేఫ్టీ టెక్నాలజీ భారతీయ రవాణా రంగంలో ఒక 'విప్లవాత్మక మార్పు' అని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అభివర్ణించారు. ఈ వీ2వీ కమ్యూనికేషన్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తే.. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను ఏకంగా 80 శాతం వరకు తగ్గించే అద్భుతమైన సామర్థ్యం దీనికి ఉందని చెప్పారు.

**అంచనా వ్యయం** ఈ పరికరాన్ని (డివైజ్) ముందుగా కొత్తగా తయారయ్యే కార్లు, బస్సులు, ట్రక్కులతో పాటు ద్విచక్ర (టూ-వీలర్) వాహనాల్లో అమర్చడాన్ని కేంద్రం తప్పనిసరి చేసే అవకాశముంది. తొలిదశ విజయవంతమైన అనంతరం, రోడ్లపై ఇప్పటికే తిరుగుతున్న పాత వాహనాల్లో కూడా ఈ టెక్నాలజీని అమర్చేందుకు వీలుగా ప్రభుత్వం భవిష్యత్తులో ప్రత్యేక నిబంధనలను తీసుకురానుంది. ఒక్కో వీ2వీ పరికరం తయారీ, అమర్చడానికి సుమారు రూ. 5,000 నుంచి రూ. 7,000 మధ్య ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా. రాబోయే సంవత్సరాల్లో రోడ్డు భద్రతా ప్రమాణాలను పెంచడంలో ఈ నిర్ణయం ఒక కీలక మలుపుగా మారనుందని ఆటోమొబైల్ రంగ నిపుణులు భావిస్తున్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం..

- ఎదురెదురుగా ఢీకొట్టుకున్న రెండు మారుతి కార్లు
- ముగ్గురు మృతి, ముగ్గురికి గాయాలు

నల్గొండ**(భారత శక్తి)** పెద్దావూర మండలం, రామన్నగూడెంలో ఎదురెదురుగా రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జున సాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# 'వంద దేవుళ్ళు' మూవీ రివ్యూ

'బిచ్చగాడు' చిత్రంతో తెలుగులో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని ఆ తరువాత పలు అనువాద చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించాడు. అయితే 'బిచ్చగాడు' స్థాయి విజయాన్ని మాత్రం అందుకోలేకపోయాడు. ఈ సారి 'బిచ్చగాడు' చిత్ర దర్శకుడు శశి దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం 'వంద దేవుళ్ళు'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. బిచ్చగాడు తరహాలోనే ఈ చిత్రం కూడా అమ్మ కథాంశంతో కావడం విశేషం. ఈ శు క్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంతో విజయ్ ఆంటోని విజయాన్ని అందుకున్నాడా? ఈ చిత్రంలోని అమ్మ సెంటిమెంట్ ఎంత వరకు వర్కవుట్ అయ్యింది అనేది రివ్యూలో తెలుసుకుందాం. భర్త మరణంతో ఒంటరి మహిళగా సమాజంలో బ్రతుకుతూ తన పిల్లలకు తనే సర్వం అయ్యి పిల్లలను చదివించి, వారిని ఉన్నతస్థానంలో చూడాలని, అందుకోసం కూలీ పని చేస్తూ పిల్లలను పెంచుతుంది వాసవి (శ్వాసిక). సమాజంలో ఒక ఒంటరి మహిళ అనుభవించే అవమానాలు, కష్టాలు అన్నీ ఎదుర్కొంటూ పిల్లలను పెద్ద చదువులు చదివిస్తుంది. అయితే ఊర్లో భర్త లేని మహిళను ఇరుగు పొరుగు వారు చూసే పద్ధతి, వారి అవమానపు మాటలు భరించలేక మళ్లీ పెళ్లి చేసుకుంటే ఈ సూటిపోటి మాటల నుంచి విముక్తి కలుగుతుందని భావిస్తుంది. తమ టీచర్ ద్వారా తల్లి పెళ్లి ఆలోచన గురించి తెలుసుకున్న పెళ్లి వయసుకు వచ్చిన వాసవి పెద్ద కొడుకు అమ్మ నిర్ణయంపై ఎంతో మండిపడతాడు. చిన్న కొడుకు కూడా మొదట్లో తల్లి నిర్ణయాన్ని తప్పుబడతాడు. అసలు కొడుకులిద్దరూ అమ్మ నిర్ణయాన్ని ఎందుకు స్వాగతించలేదు. ఆ తరువాత అదే కొడుకులు అమ్మకు పెళ్లి చేయడానికి ఎంత తపనపడతారు? ఇందుకోసం వారి ప్రాణాలు తెగించి ఊరి పెద్దలతో ఎందుకు ఫైట్ చేశారు? వాసవికి, ఏడుకొండలు( విజయ్ ఆంటోని)కి పెళ్లి జరిగిందా? అనేది మిగతా కథ భర్త చనిపోయిన తరువాత ఓ మహిళ అమ్మగా, ఒంటరిగా తన పిల్లలను ప్రయోజకులను చేయడానికి తను అంతా కోల్పోయి, తన జీవితాన్ని పణంగా పెట్టి పిల్లలను ప్రయోజకులను చేయడానికి అహర్నిశలు శ్రమిస్తుంటుంది. తనకు ఓ జీవితం ఉందనే విషయాన్ని మరిచిపోతుంది. ఇలాంటి ఓ కథాంశంతో అమ్మ కూడా ఓ మనిషే. ఆమెకు మనసుంటుంది. అది తెలియక ఆమె జీవితాన్ని కూడా మనమే బతికేయకూడదు అనే ఓ పర్పస్‌ఫుల్ కథతో, అమ్మ సెంటిమెంట్‌తో దర్శకుడు శశి ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ప్రస్తుత సమాజంలో పల్లెటూర్లలో ఉన్న కట్టుబాట్లు, సంప్రాదాయం పేరిట ఉన్న ఇలాంటి విచిత్ర ధోరణుల కారణంతో ఎంతో మంది అమ్మల జీవితాలు ఆరంభ దశలోనే ముగిసిపోతున్నాయనే విషయాన్ని ఈ చిత్రంలో చూపించారు. వాసవి జీవితంతో మొదలైన ఈ కథలో ఒంటరి మహిళగా ఆమె సమాజంలో పడే సంఘర్షణ, అమ్మ, కొడుకుల ప్రేమ ఇవన్నీకథను ముందుకు నడిపించాయి. పిల్లలు పెద్దవ్వడం, ఉద్యోగాలు, ప్రేమ, వీటితో పాటు వాసవికి మరో జీవితం ఇవ్వాలనే కొడుకుల ఆలోచన ఇవన్నీ ఆసక్తిగానే కొనసాగుతాయి. కథనం స్లోగా కొనసాగిన భావోద్వేగాలు పండటంతో ప్రేక్షకుడు కథలో లీనమవుతాడు. ప్రథమార్థం సాగదీసినట్లుగా, అక్కడక్కడా బోరింగ్ సన్నివేశాలతో ముగుస్తుంది. ఇక ద్వితీయార్థంలోనూ ప్రేక్షకుడి ఊహించిన కథే జరుగుతుందటంతో పెద్ద ఆసక్తికరంగా అనిపించదు. అయితే కథను నడిపిన విధానం, స్క్రీన్‌ప్లే ఆకట్టుకుంటుంది. వాసవి పెళ్లికి ఎదురయ్యే సమస్యలు, వాటిని కొడుకు వివేక్ ఎలా అధిగమించాడు? ఏడుకొండలు పాత్ర పరిచయం ఈ సన్నివేశాలన్నీ కథను ఇంట్రెస్టింగ్‌గా కొనసాగించేటట్లు చేశాయి. ఏడుకొండలు పాత్రను డిజైన్ చేసిన విధానం అలరిస్తుంది. ఏడుకొండలు, వాసవి మధ్య సన్నివేశాలు క్యూట్‌గా, మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తాయి.ఈ సినిమా చూస్తుంటే అందరికి తెలుగులో వచ్చిన 'మా నాన్నకి పెళ్లి' సినిమా గుర్తుకు వస్తుంది. అయితే ఆ చిత్రంలో కథ నాన్న పెళ్లి చుట్టూ అల్లుకుంటే ఈ సినిమాలో అమ్మ పెళ్లి నేపథ్యంతో కథ ఉంటుంది. అయితే ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలు మళ్లీ మళ్లీ చూస్తున్న భావనను కలిగిస్తాయి. సాధారణంగా ఇలాంటి సినిమాల్లో పతాక సన్నివేశాలు పాఠాలు చెబుతున్నట్లుగా పేజీల కొద్ది పవర్‌ఫుల్ డైలాగులతో ఉంటాయి. కానీ ఈ సినిమాలో సింపుల్‌గా ఎంటర్‌టైన్‌మెంట్‌వేలో ముగించిన విధానం బాగుంది. అయితే రచన పరంగా ఈసినిమాను మరింత బలంగా రాసుకుని ఉంటే పూర్తిస్థాయిలో అలరించే అవకాశం ఉండేది. వాసవి పాత్రలో శ్వాసిక నటన ఈ చిత్రానికి ప్రాణం. ఆమె నటన ఎంతో సహజంగా, భావోద్వేగంగా అనిపిస్తుంది.సంభాషణలకు మించి ఆమె హావాభావాల్లో చూపెట్టిన ప్రతిభ మెప్పిస్తుంది. ఏడుకొండలుగా విజయ్ ఆంటోని పాత్ర నిడివి తక్కువైనా తనదైన నటనతో అలరించాడు. కొడుకులుగా భాస్కర్, దీషన్ నటన పర్వాలేదు. కావ్య అనిల్, లిజోమోల్ జోస్, కరుణాస్, బాలాజీ శక్తివేల్ నటన గుర్తుండిపోతుంది. పాటలు, నేపథ్య సంగీతం కథను వేగంగా నడిపించడానికి దోహదపడ్డాయి. సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ బాగానే కుదిరాయి.

ఈ సినిమాలో సంభాషణలు కొన్ని గుర్తుండిపోతాయి. దర్శకుడు తను చెప్పాలనుకున్న అంశాన్ని నిజాయితీగా చెప్పే ప్రయత్నం చేశాడు. 'వంద దేవుళ్ళు' చిత్రాన్ని 'బిచ్చగాడు'ను దృష్టిలో పెట్టుకుని వెళితే ఈ సినిమా విషయంలో నిరాశపడతారు. నెమ్మదిగా సాగే కథనం, అక్కడక్కడా బోరింగ్ సన్నివేశాలను మినహాయిస్తే సెంటిమెంట్ సినిమాలు, కుటుంబ బావోద్వేగాల చిత్రాలను ఇష్టపడే వారిని ఈ సినిమా సంతృప్తి పరుస్తుంది.




# రష్మిక 'మైసా' నుంచి అప్‌డేట్..
## సాంగ్ షూటింగ్ పూర్తి!



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నుంచి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలోని ఒక కీలకమైన పాట చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర దర్శకుడు రవీంద్ర పుల్లే వెల్లడించారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో సెట్స్‌కు సంబంధించిన ఫోటోను పంచుకుంటూ, "చవీఎయ్యి సాంగ్ ప్యాకప్" అని ఆయన పోస్ట్ చేశారు. రష్మికపై చిత్రీకరించిన ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ప్రకటించినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కేరళలో ఈ సినిమాకు సంబంధించి ఒక సుదీర్ఘ షెడ్యూల్ పూర్తయిన సంగతి తెలిసిందే. ఆ షెడ్యూల్‌లో స్టంట్ మాస్టర్ కెచా కంపాక్డీ పర్యవేక్షణలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఇందులో రష్మిక స్వయంగా కొన్ని హై-ఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించినట్లు సమాచారం. ఈ యాక్షన్ సన్నివేశాల్లో సహజంగా నటించేందుకు రష్మిక థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అక్కడ రోజూ 8 గంటల పాటు శ్రమించి, అంతర్జాతీయ నిపుణుల వద్ద అధునాతన స్టంట్స్, హ్యాండ్-టు-హ్యాండ్ కంబాట్ వంటివి నేర్చుకున్నారు. ఈ చిత్రంలో రష్మిక ఒక గిరిజన (గోండు) యువతి పాత్రలో కనిపించనున్నారు. శారీరకంగా, మానసికంగా ఎంతో శ్రమ అవసరమైన ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండీ లాంగ్ ఈ చిత్రానికి స్టంట్స్ పర్యవేక్షిస్తున్నారు. రష్మికతో పాటు ఈశ్వరీ రావు, గురు సోమసుందరం, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రేయాస్ పి కృష్ణ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు.



## తినాలని ఉన్నా తినలేని స్థితిని అనుభవించా: సమంత

సెలబ్రిటీల శారీరక ఆకృతి, బరువుకు సంబంధించి సోషల్ మీడియాలో నిరంతరం సాగే చర్చలపై ప్రముఖ కథానాయిక సమంత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా తను సన్నబడటంపై నెటిజన్లు చేస్తున్న కామెంట్లకు ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. తాను కావాలని ఎలాంటి డైటింగ్ చేయలేదని, తీవ్రమైన 'మయోసైటిస్' (కండరాల వాపు వ్యాధి) బారిన పడటం వల్లే తన బరువు తగ్గాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఎదుటివారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా సులభంగా విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు.తన తాజా ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. "గతంతో పోలిస్తే ఇప్పుడు నా ఆరోగ్యం కుదుటపడింది. కావాల్సిన ఆహారాన్ని తీసుకోగలుగుతున్నాను. అయితే, అతిగా తింటే మయోసైటిస్‌పై ప్రభావం పడుతుందన్న వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం మితంగానే తింటున్నాను. తీవ్ర అనారోగ్య పరిస్థితుల కారణంగా నాకు తినాలని ఉన్నా తినలేని నిస్సహాయ స్థితిని అనుభవించాను. అంతే తప్ప, అందం కోసం డైటింగ్ చేసి బరువు తగ్గలేదు" అని చెప్పారు.తన పెంపుడు పిల్లికి 'జెలాటో' (ఒక రకమైన ఐస్‌క్రీమ్) అని పేరు పెట్టడం వెనుక ఉన్న కారణాన్ని సామ్ వివరించారు. మయోసైటిస్ చికిత్సలో భాగంగా దాదాపు రెండేళ్ల పాటు ఎలాంటి ఉప్పు, కారం లేని పరిమిత ఆహారాన్ని మాత్రమే తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ కఠినమైన రోజుల్లో కోలుకున్న తర్వాత వైద్యులు మొదటిసారిగా 'చక్కెర లేని జెలాటో ఐస్‌క్రీమ్' తినడానికి అనుమతించారని, ఆ జ్ఞాపకార్థమే తన పిల్లికి ఆ పేరు పెట్టినట్లు తెలిపారు.ఇదిలా ఉండగా, సమంత ప్రధాన పాత్రలో నటించిన లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మా ఇంటి బంగారం' నేడు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది.

# వినోదాల పండుగకు శ్రీకారం




అగ్ర కథానాయకులు వెంకటేష్-కల్యాణ్‌రామ్ నటిస్తున్న భారీ మల్టీస్టారర్ గురువారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కీర్తి సురేష్, కృతిశెట్టి కథానాయికలు. నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, సురేష్‌బాబు కెమెరా స్విఛాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు అనిల్ రావిపూడి శైలిలో ఆద్యంతం హాస్యభరితంగా సాగే చిత్రమిదని, సంక్రాంతి బరిలో వినోదాల పండగలా ప్రేక్షకుల్ని అలరిస్తుందని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, సమర్పణ: సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, అర్చన, నిర్మాత: సాహు గారపాటి, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

## బాలయ్య సరసన కాజల్.. ఫస్ట్ లుక్ వచ్చేసింది!



నందమూరి బాలకృష్ణ హీరోగా, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'NBK111' నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలో ఆమె నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. దీంతో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. ఈరోజు విడుదల చేసిన పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి ఎంతో గంభీరంగా, సీరియస్ లుక్‌తో కనిపించారు. దీంతో ఈ సినిమాలో ఆమె పాత్రపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ మొదలైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' చిత్రం తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఆ సినిమాలో కాజల్ పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. అయితే, NBK111'లో మాత్రం ఆమె పూర్తిస్థాయి హీరోయిన్‌గా, కథను కీలక మలుపు తిప్పే పాత్రలో కనిపించనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ యాక్షన్, ఎమోషన్స్‌తో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

# లక్ష్మి పాత్ర ఓ సవాలు



'ఇందులో నా పాత్ర పేరు లక్ష్మి. పక్కింటి అమ్మాయిలా సహజంగా అనిపించే పాత్ర. మేకప్ లేకుండా నటించాను. భర్తకు ప్రతి విషయాల్లోనూ సపోర్ట్‌గా నిలిచే ఓ చక్కటి గృహిణి పాత్ర నాది. నా రియల్ లైఫ్‌కి పూర్తి వ్యతిరేకమైన ఈ తరహా పాత్ర చేయడం నిజంగా నాకొక ఛాలెంజే' అని కథానాయిక రాశీసింగ్ అన్నారు. వడ్డే నవీన్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్‌తేజ నార్ల దర్శకుడు. ఈ నెల 19న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం రాశీసింగ్ హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'వడ్డే నవీన్ హీరో అని తెలిశాక, ఆయన నటించిన సినిమాలపై సెర్చ్ చేశాను. నిజంగా ఆ హిట్స్ చూసి షాక్ అయ్యాను. 'యాక్టింగ్‌కి ఇంత గ్యాప్ ఇచ్చారెందుకు?' అని ముందుగా నేనే ఆయన్ను అడిగాను. నవీన్ నిజంగా చాలా ఇంటలెక్చువల్. ఆయన దగ్గర వరల్డ్ నాలెడ్జ్ ఎక్కువగా ఉంటుంది. కానీ సోషల్ మీడియాకు మాత్రం ఆయన దూరం. నేనే బలవంతంగా ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేయించాను. ఈ సినిమాలో ఆయన పాత్ర చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపింది రాశీసింగ్. దర్శకుడు కమల్‌తేజ్ పూర్తి క్లారిటీ ఉన్న దర్శకుడని, అనుకున్న అవుట్‌పుట్ వచ్చేవరకూ తను రాజీ పడడని, ఆయనతో జర్నీ చాలా స్మూత్‌గా ఉంటుందని, రీసెంట్‌గా సినిమా మొత్తం చూశానని, అద్భుతంగా అనిపించిందని, ముఖ్యంగా క్లైమాక్స్ ట్విస్ట్ సూపర్ అని రాశీసింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం 'గాసిప్' అనే ఓటీటీ సినిమా చేస్తున్నట్టు, మరికొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నట్టు రాశీసింగ్ తెలిపింది.

## ఫోటో స్టూడియోను ప్రారంభించిన సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్



జనగామ(భారత శక్తి)జూన్ 19: దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ గుమ్మడవెల్లి సోమేష్ నూతనంగా ఏర్పాటు చేసిన ఫోటో స్టూడియోను ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా ప్రారంభించిన సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దీ=ూమండల ముఖ్య నాయకులు ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త ఏల సుందర్. ఈ సందర్భంగా ఏల సుందర్ మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో ముందుకు రావాలని సూచించారు. స్టూడియో యజమాని గుమ్మడవెల్లి సోమేశ్ కు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఫోటో స్టూడియోతో పాటు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ప్లాస్టిక్ ఐటమ్స్ కు సంబంధించిన వస్తువులను గ్రామస్తులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గ్రామ ప్రజాప్రతినిధులు నాయకులు యువజన నాయకులు స్థానికులు తదితరులు ఉన్నారు.

## ఆ ఊరి పక్షులకు సర్పంచే 'అల్లిటట్టు'

# గూళ్లు కట్టి.. గింజలు చల్లి..

### -పక్షులకు ఆశ్రయం కల్పించిన గ్రామ సర్పంచ్ తిరుపతి.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి) మామడ మండలం రాయదారి గ్రామంలో పక్షుల సంరక్షణకు ఓ వినూత్న కార్యక్రమం చేపట్టారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పక్షులకు ప్రత్యేకంగా గూళ్లు ఏర్పాటు చేయడంతో పాటు వాటి ఆహారం, తాగునీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెరుగుతున్న నగరీకరణ, చెట్ల నరికివేత, వాతావరణ మార్పుల కారణంగా పక్షులు తమ సహజ నివాసాలను కోల్పోతున్న తరుణంలో ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

గ్రామంలోని చెట్లు, పాఠశాల ప్రాంగణాలు, దేవాలయాల పరిసరాల్లో చెక్కతో తయారు చేసిన చిన్న గూళ్లను ఏర్పాటు చేశారు. ఈ గూళ్లలో పిచ్చుకలు, గువ్వలు, మైనాలు, చిలుకలు వంటి చిన్న పక్షులు నివసించేలా ప్రత్యేకంగా రూపొందించారు. వేసవి కాలంలో నీటి కొరతతో ఇబ్బందులు పడే పక్షుల కోసం గ్రామంలోని పలు ప్రాంతాల్లో నీటి పాత్రలు కూడా ఉంచారు.

### పిచ్చుకల సంఖ్య పెంచడమే లక్ష్యం

ఒకప్పుడు ప్రతి ఇంటి ఆవరణలో కనిపించే పిచ్చుకలు ప్రస్తుతం అంతరించిపోతున్నాయి. మొబైల్ టవర్లు, కాంక్రీట్ నిర్మాణాలు, పర్యావరణ మార్పుల ప్రభావంతో పిచ్చుకల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో గ్రామంలో పిచ్చుకల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం విశేషం.

పక్షుల పెంపకం వల్ల లాభాలుపక్షులు ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పంటలకు హానికరమైన పురుగులను తిని రైతులకు సహాయం చేస్తాయి. పుష్పాల పరాగసంపర్కంలో కూడా కొన్ని పక్షులు ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. గ్రామాల్లో పక్షుల కిలకిలారావాలు ప్రకృతికి కొత్త అందాన్ని తీసుకొస్తాయి.'అల్లిటట్టు'గా మారిన సర్పంచ్పక్షులకు గూళ్లు కట్టించడం, గింజలు వేయడం, నీటి పాత్రలు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ సర్పంచ్ పక్షులకు నిజమైన 'అల్లిటట్టు'గా నిలిచారని గ్రామస్థులు కొనియాడుతున్నారు. ప్రతి ఇంటి ముందు ఒక నీటి పాత్ర, ప్రతి చెట్టుపై ఒక గూడు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంపక్షులను కాపాడటం అంటే ప్రకృతిని కాపాడటమేనని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. రాయదారి గ్రామంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని, ప్రతి గ్రామంలో ఇలాంటి చర్యలు చేపడితే పక్షుల సంఖ్య పెరిగి పర్యావరణ సమతుల్యత మరింత బలపడుతుందని అభిప్రాయపడుతున్నారు."ఒక గూడు కట్టండి... ఒక పక్షిని కాపాడండి. ప్రకృతిని పరిరక్షించండి" అనే సందేశంతో గ్రామంలో అవగాహన కార్యక్రమాలు కూడా గ్రామ సర్పంచ్ తిరుపతి నిర్వహిస్తున్నారు.

## రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి.

### -సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు



మణుగూరు, జూన్ 19 (భారతశక్తి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో కామ్రేడ్ దామల్ల లెనిన్ బాబు అధ్యక్షతన మణుగూరు మండల కమిటీసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రపల్లి మాట్లాడుతూ రైతులు సాగు పనులు ప్రారంభిస్తున్న ఈ సమయంలో యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సరిపడా నిల్వ ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందించడంతో పాటు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఎరువుల కొరత కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వ్యవసాయ అధికారులను గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నందున రైతుల అవసరాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొల్లం రాజు, మడి నరసింహారావు, పిట్టల నాగమణి, కుంజరాజు, తోట పద్మ, ఎం సుదర్శన్, తాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, వసతుల కల్పనే లక్ష్యం

- దిలవార్‌పూర్ కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం - మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశం

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారత శక్తి ) ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగ్గా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.శుక్రవారం దిలవార్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలను పరిశీలించి, పాఠశాల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి వారి విద్యా నైపుణ్యాలను పరీక్షించారు. పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి విషయాన్ని శ్రద్ధగా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.వసతి గృహంలోని స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, నిల్వ ఉంచిన కూరగాయలు, వంట సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. సరుకులు వచ్చిన వెంటనే వాటి నాణ్యతను పరిశీలించి, నాణ్యమైన సరుకులను మాత్రమే వినియోగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే ప్రతిరోజూ రుచికరమైన, పోషకాహార భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు.తనిఖీలో భాగంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.ఈ



కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, మండల ప్రత్యేక అధికారి (డిఆర్ఓ) రాథోడ్ రమేష్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

- సూర్యాపేట జిల్లా కేంద్రాన్ని సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దుతాం.
- పట్టణంలో అదనంగా మరో 20 సీసీ కెమెరాల ఏర్పాటు.. కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం
- భూకబ్జాదారులు, రౌడీషీటర్లపై నిరంతర నిఘా.
- ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక ప్రణాళిక ఆపరేషన్ రోప్
- మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత.. వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు
- ఫిర్యాదులపై తక్షణ స్పందన.. బాధితుల ఇళ్లకు వెళ్లి కేసులు నమోదు, స్టేషన్ల చుట్టూ తిరిగే అవసరం లేదు.



సూర్యాపేట, భారత్ శక్తి జిల్లా ప్రతినిధి,జూన్ 19: జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఈరోజు సూర్యాపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ కి డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్సైలు మరియు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి, గౌరవ వందనంతో స్వాగతం తెలిపారు. అనంతరం సిబ్బంది నిర్వహించిన కవాతును పరిశీలించిన ఎస్పీ , వారి యూనిఫామ్స్ మరియు కిట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, స్టేషన్‌లోని వివిధ రకాల కీలక రికార్డులను, శాంతిభద్రతల నిర్వహణ ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. పిర్యాదులు, కేసులు పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలి, కోర్టులతో సమన్వయంగా పని చేసి ఎక్కువ కేసుల్లో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని అన్నారు. బాధితులకు రక్షణ, భద్రత కల్పించడం ప్రాథమిక విధి, బాధ్యత అన్నారు. సిబంది విధులను పర్యవేక్షణ చేయాలి సమర్థవంతంగా పని చేసేలా నైపుణ్యాలను వృద్ధి చేయాలను అన్నారు. జిల్లా కేంద్రంలో అప్రమత్తంగా ఉంటూ నేరాలను పటిష్టంగా



నిరోధించాలని అన్నారు,

### - 20 సీసీ కెమెరాల ప్రారంభం

ప్రజల రక్షణ మరియు ట్రాఫిక్ నియంత్రణను మరింత బలోపేతం చేయడంలో భాగంగా పట్టణ కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మరో 20 సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. వీటిని తక్షణమే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రాన్ని అత్యంత సురక్షిత పట్టణంగా మార్చడమే మా ప్రాధాన్యత. ముఖ్యంగా మహిళల, విద్యార్థినుల భద్రతకు మేము అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాము. మహిళలను వేధించే వారిపై, ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం పాఠశాలలు, విద్యాసంస్థలు ప్రారంభమైనందున, విద్యార్థినుల భద్రత పట్ల అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. పోలీస్ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నాం. ప్రజల నుండి ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు నేరుగా బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అక్కడికక్కడే కేసులు నమోదు చేసి తక్షణ సహాయం అందిస్తున్నాం. దీనివల్ల బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి ఇంటి వద్దకే పోలీసు సేవలను చేరవేస్తున్నాం."

ప్రజలకు ఇబ్బందులు కలిగించే రౌడీషీటర్లు, భూకబ్జాదారులు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచుతాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక నివారణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నాం."ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఎస్సైలు ఏడు కొండలు, మహేందర్, శివతేజ, సందీప్, వెంకన్న, రహిముద్దీన, ఏఎస్సై శంకర్, మరియు స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్బి సిబంది ఎస్ఐ యాకూబ్, ఏఎస్ఐ అంజన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శేఖర్ రెడ్డి, సీసీ సందీప్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్ ఆటోల్లో ఆరుగురికే అనుమతి!

- విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై నిబంధనలు కఠినతరం
- ట్రాఫిక్ వింగ్ సమన్వయ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశం

హైదరాబాద్ జూన్ 18 (భారత శక్తి ):పాఠశాల విద్యార్థుల సురక్షిత ప్రయాణం, ఆరోగ్యం మరియు భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ స్పష్టం చేశారు. రవీంద్ర భారతిలో హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం నిర్వహించిన ఉన్నత స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### - సమిష్టి బాధ్యతతోనే సురక్షిత వాతావరణం

సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం కేవలం ఒకరి బాధ్యత కాదని.. పాఠశాలలు, తల్లిదండ్రులు, పౌర సరఫరాల-రవాణా సంస్థల ఉమ్మడి కర్తవ్యమని గుర్తుచేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, సురక్షిత ప్రయాణానికి ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు.







### ఆటోల్లో పరిమితి దాటితే చర్యలు!

పాఠశాల ఆటోలు మరియు రవాణా వాహనాలు ఖచ్చితంగా నిబంధనలకు లోబడి నడవాలని కమిషనర్ ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాల ఆటోల్లో గరిష్టంగా ఆరుగురు పిల్లలను మాత్రమే తీసుకెళ్లాలని, అంతకంటే ఎక్కువ మందిని ఎక్కించుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### - స్కూల్ ఆవరణలోనే వాహనాల నిలుపుదల

పాఠశాలల ప్రారంభం మరియు ముగింపు సమయాల్లో రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. విద్యార్థులను దింపడానికి, తిరిగి తీసుకెళ్లడానికి వచ్చే వాహనాల కోసం పాఠశాల ఆవరణలోనే తగిన ఏర్పాట్లు చేయాలని యాజమాన్యాలను ఆదేశించారు. దీనివల్ల ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని పేర్కొన్నారు.

### - పరిశుభ్రతే పరమావధి.. అవగాహన సదస్సులు తప్పనిసరి

పాఠశాల లోపల, చుట్టుపక్కల పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ఎంతో కీలకమని కమిషనర్ ఉద్ఘాటించారు.

- విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై నిరంతరం అవగాహన కల్పించాలి.
- ఆరోగ్యం, పరిశుభ్రత అలవాట్లపై పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలి.
- చిన్నతనం నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను నేర్పించడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి పునాది పడుతుందని కమిషనర్ స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ జిల్లా స్థాయి సభ

### - పాల్గొన్న కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి.

**బద్వేలు(భారత శక్తి)** కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కడపలో నిర్వహించిన జిల్లా స్థాయి విజయోత్సవ సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మ , జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలు, వివిధ రంగాలలో సాధించిన పురోగతిపై విస్తృతంగా చర్చించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని తెలిపారు. అలాగే, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రజల సహకారంతో మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కూటమి శ్రేణులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy